జైల్లో పరిచయం..
నిత్యం దొంగతనాలు
● నల్లజర్లలో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్ 6

రాజ్యాంగం రక్షించబడాలంటే ఏకాత్మను అర్థంచేసుకోవాలి



రాజ్యాంగ సమర్పణ దినోత్సవ సెమినార్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్

రాజ్యాంగ సమర్పణ దినోత్సవ సెమినార్‌లో బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్
బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎంపీ ఉండవల్లి హాజరు


రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం రక్షించబడాలంటే ఏకాత్మను అర్థం చేసుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఆంధ్రకేసరి సెంటినరీ రోటరీ హాలులో ప్రకాశం అభివృద్ధి, అధ్యయన సంస్థ - ఆంధ్రకేసరి యువజన సమితి సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మాధవ్ మాట్లాడుతూ అత్యంత మేధస్సు కలిగిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. కాలంలో అవసరమైన మార్పులు చేసుకుంటూ దేశ ప్రయోజనాలకోసం నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ అంబేడ్కర్ సూచించారని అన్నారు. అనేక కులాలు, మతాలు, ప్రాంతీయతలు ఉన్నా దేశంలో అందరూ భిన్నమే అని ఇక్కడ ఏకాత్మత సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రాల మధ్య అన్ని అంశాల్లోనూ సమన్వయం అవసరమన్నారు. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిని భారతీయులంతా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా రేషన్‌కార్డులు, పింఛన్లు వంటి ఆలోచనలతో సాగడం రాజ్యాంగ స్ఫూర్తికి అవరోధం కల్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ త్యాగమే పెట్టుబడిగా ఆనాడు ప్రకాశం రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు వి.భాస్కరరామ్ సభకు అధ్యక్షత వహించారు. ప్రకాశం అభివృద్ధి అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.మోహనరావు, విజయవాడ లయోలా కాలేజీ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, ఆంధ్రకేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి సీపీ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

చిక్కితే.. ఖాతా ఖాళీ!

చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
మళ్లీ చేతికి చేరడం అసాధ్యమే
అప్రమత్తతే ఆయుధం



దొంగలున్నారు.. జాగ్రత్త!. ఇది పోలీసులు తరచు చేసే హెచ్చరిక. మీరు ఎక్కడికైనా వెళితే ఇంట్లోని బంగారం, డబ్బు సురక్షితంగా దాచుకొని వెళ్లాలని చెబుతారు. లేదంటే తమకు సమాచారం ఇస్తే మీ ఇంటికి రక్షణ కల్పిస్తామని కూడా ఈమధ్య హోరెత్తిస్తున్నారు. ఒకవేళ సొత్తు చోరీకి గురైనా పోలీసుల దర్యాప్తులో దొంగలు పట్టుబడటం, సొత్తు రికవరీ చేయడం కూడా మనకు తెలుసు. ఇప్పుడు దొంగలు పడుతున్నది ఇళ్లలో కాదు.. జేబు దొంగలూ కాదు.. మీ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లోనే ఓ కన్నేస్తారు. ఏదొక ఎత్తుగడతో మాయ చేసో, బెదిరించో బ్యాంకు అకౌంట్ల నుంచి మొత్తం దోచేస్తున్నారు. ఇందులో ధనవంతులే కాదు.. చిరుద్యోగులు, ఉద్యోగ విరమణ చేసినవారు, పింఛను పొందుతున్న వృద్ధులు సైతం ఆన్‌లైన్ మోసంలో చిక్కి బలైపోతున్నారు.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సైబర్ క్రైం విషయంలో దొంగా పోలీస్ ఆటలో దొంగలదే పైచేయిగా నిలుస్తోంది. ఆధునిక సాంకేతికతను పోలీసులు అర్థంచేసుకొనేలోపుగా సైబర్ బూచోళ్లు ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఇప్పటివరకూ సైబర్ నేరాల్లో గంటలోపుగా ఫిర్యాదుచేస్తే డబ్బు వెనక్కి రప్పించే అవకాశాలు సగమన్నా ఉండేవి. ఇప్పుడు ఆ సమయం నిమిషాల్లోకి వచ్చేసింది. సొమ్ము ఒక్కసారి ఖాతా దాటితే దాదాపుగా బూడిదలో పోసిన పన్నీరేనని కేసులు రుజువు చేస్తున్నాయి. అధిక శాతం పోలీసులకు ఈ నేరాలపై అవగాహన లేదు. ఎఫ్‌ఐఆర్ ఎలా, ఏ సెక్షన్ల ప్రకారం నమోదుచేయాలో కూడా తెలియక తికమకపడుతున్నారు. బాధితుడు మోసపోయానని గుర్తించి తేరుకొనేలోపుగా ఆ డబ్బులు నాలుగైదు దశలు దాటిపోతోంది. కొన్నేళ్ల కిందట లాటరీల పేరుతో నైజీరియన్లు సైబర్ నేరాలకు తెరతీశారు. తర్వాత మార్పులు సంతరించుకుంటూ బ్యాంకు ఓటీపీ, ఆధార్ అప్‌డేట్, ప్రభుత్వ పథకాల పేరుతో, కొరియర్, కొద్ది పెట్టుబడితో భారీ రాబడి, యాప్‌లు ఇలా రకరకాల మోసాలు సాగుతూ డిజిటల్ అరెస్టుల వరకూ పరిస్థితి చేరింది. రోజుకో మోసపు ఆలోచనతో కోట్ల సొమ్మును సైబర్ బూచోళ్లు తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వాలు, సాఫ్ట్‌వేర్లు, సర్వర్ల విషయంలో ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నా అవన్నీ బలాదూర్ అని నేరగాళ్లు నిరూపిస్తున్నారు.

● రికవరీ దైవాధీనం

ప్రస్తుతం సైబర్ క్రైంలో రికవరీ శాతం అతి స్వల్పం. రూ.10 కోట్లు పోగొట్టుకుంటే రూ.లక్ష కూడా వెనక్కి రప్పించలేని పరిస్థితి. దర్యాప్తు ఎంత ముమ్మరంగా, తెలివిగా చేసినా ఖాతా నుంచి మాయమైన డబ్బులు వెనక్కి రావడం లేదు. ఖాతా నుంచి డబ్బులు దొంగిలించారని బ్యాంకు వాళ్లకు చెబితే.. పోలీసులకు ఫిర్యాదు చేయండని ఉచిత సలహా పడేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరాలు రోజుకు 20 వరకూ జిల్లా కేంద్రాల్లోని సైబర్ సెల్‌లో రిపోర్టు అవుతున్నాయి. ఇక పోలీస్ స్టేషన్లకు వచ్చినవి, ఎవరికీ చెప్పలేక ఉండిపోయినవి ఇంకెన్నో.

ఏపీకే క్లిక్ చేస్తే.. ఖతం

ఆర్టీవో, ఎస్‌బీఐ, పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్స్‌తో బురిడీ

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురం పట్టణానికి చెందిన సత్యప్రసాద్‌కు తెలిసిన మిత్రుడు వాట్సాప్ నుంచి సందేశం వచ్చింది. మీకు పీఎం కిసాన్ పడిందా లేదా చూసుకోండి అంటూ ఏపీకే ఫైల్‌ను అతను పంపినట్టు పంపారు. దాన్ని క్లిక్ చేశాడు. ఫోన్ హేక్ అయింది. ఉన్న రెండు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఖాళీ కావడంతోపాటు ఇదే రీతిలో అతని పేరుతో కాంటాక్టు లిస్టులో ఉన్నవారందరికి మెసేజీలు వెళ్లాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన నరసింహరావుకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వాట్సాప్ మెసేజీ వచ్చింది. మీ ఎస్‌బీఐ రివార్డ్స్ అప్‌డేట్ చేసుకోండి అని అంతే క్లిక్ చేశాడు. అతని బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.6,500 డెబిట్ అయినట్టు మెసేజీ వచ్చింది. ఇలా రకరకాల ఏపీకే ఫైల్స్ తెలుసున్న వ్యక్తులు, స్నేహితులు, బంధువుల దగ్గర నుంచి వచ్చినట్టు వాట్సాప్‌లు ద్వారా వ్యక్తిగతంగా, గ్రూప్‌ల్లో వస్తున్నాయి. ఏపీకే ఫైల్ ఓపెన్ చేయగానే ఫోన్ హేక్ చేసి డిస్‌ప్లే పేరును స్టేట్‌బ్యాంకు లేదా ప్రభుత్వ సంస్థలుగా మార్చివేసి ఆ పేరుతోనే మెసేజీలు పంపుతున్నాయి. తెలియక కొందరు క్లిక్ చేసి మోసపోవడం జరుగుతోంది. మోసపోయిన వారిలో డెబిట్ అయిన సొమ్ములు తక్కువ కావడంతో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు.

● డిజిటల్ అరెస్టు.. రూ.34 లక్షలకు టోపీ

ముమ్మిడివరానికి చెందిన విశ్రాంతి మండల విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీకి ఈనెల 8న టెలిఫోన్ డిపార్టుమెంట్ పేరిట ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మీ నంబరుపై బెంగళూరులో ఒక సీరియస్ కేసు నమోదై ఉందని, మహారాష్ట్ర కెనారా బ్యాంకులో ఏటీఎం నేరం ఉందని, రూ.3 కోట్ల కుంభకోణంలో రూ.75 లక్షలు మీకు ముట్టిందని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించారు. విశ్రాంత ఎంఈవోను బెదిరించి ఆయన అకౌంట్‌లోని రూ.15 లక్షలు లాగేశారు. తర్వాత పీఎఫ్ లోన్ తీసుకోమని వారే చెప్పి 12న రూ.9 లక్షల 80 వేలు, 15న రూ.9 లక్షల 80వేలు మొత్తం మూడు దఫాలుగా రూ.34లక్షల 60వేలు ఆర్టీజీఎస్ చేయించుకుని టోపీ పెట్టారు. ఆ సొమ్ములు తిరిగి తన ఖాతాకు జమకాకపోవడంతో వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను సైబర్ నేరగాళ్ల మోసానికి గురైనట్టు గుర్తించి ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు.

● రూ.74 లక్షలు కొట్టేశారిలా..

రాజానగరం మండలం కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్. ఆగస్టు 17న స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికారు. సావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా ఓపెన్ చేయగా, డీమ్యాట్ అకౌంట్ ఓపెన్‌చేయాలని మెసేజ్ వచ్చింది. తర్వాత దఫదఫాలుగా 11సార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

● రికవరీ చేశారు..

రాజమహేంద్రవరంలో కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. కస్టమర్‌కేర్ నంబరుకోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఓ నకిలీ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా ఓటీపీని చెప్పడంతో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ సొమ్మును ఫ్రీజ్‌చేసి పదిరోజుల్లో వెనక్కి రప్పించారు.

● తక్షణం ఏమి చేయాలి..

సైబర్ నేరం జరిగి ఖాతాలో డబ్బులు పోతే వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి అకౌంట్ ఫ్రీజ్ చేయించాలి. సైబర్‌క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేయడంతోపాటు నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదుచేయాలి. మీ పరిధి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యా దుచేయాలి. గతంలో గంటలోపు టోల్‌ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేస్తే డబ్బులు విత్‌డ్రా కాకుండా బ్యాంకు ఫ్రీజ్ చేసేది. ఇప్పుడు నిమిషాల్లోనే నేరగాళ్లు క్రిప్టో కరెన్సీలోని మళ్లించేస్తున్నారు.

రేపటి నుంచి డిసెంబర్ 2 వరకూ

'రైతన్న మీకోసం' ఇంటింటి సర్వే

కలెక్టర్ కీర్తి చేకూరి టెలికాన్ఫరెన్స్

రాజమహేంద్రవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ 'రైతన్న-మీకోసం' కార్యక్రమం కింద హౌస్ టు హౌస్ సర్వే నిర్వహించనున్నారు. రైతుల జీవనోపాధి, ఆర్థికస్థితి, నైపుణ్యాభివృద్ధితో అంచనా వేసి, రైతుల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం సాయంత్రం స్థానిక క్యాంప్ కార్యాలయం నుంచి వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యాన, మత్స్య, అనుబంధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశాల ప్రకారం రైతుల స్థితిగతులపై ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి రైతుతో మాట్లాడడం కోసం ఏడు రోజుల పాటు హౌస్ టు హౌస్ సర్వే చేయనున్నట్టు చెప్పారు. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే ఐదు సూత్రాల పట్ల రైతులకు అవగాహన కల్గించనున్నట్టు చెప్పారు. ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు రైతుల ఇళ్లకు అధికారుల బృందాలు వెళతాయని, ఈనెల 30 నుంచి డిసెంబర్ 2 వరకూ డేటా సేకరించి విశ్లేషిస్తారన్నారు. వచ్చేనెల 3వ తేదీన ఈ డేటా ఆధారంగా 2026-27 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తామని, దాన్ని ప్రతీ రైతు సేవా కేంద్రంలోనూ కార్యశాల నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రం ద్వారా నిర్వహించే ఈ ప్రచారంలో ఆర్‌ఎస్‌కే సహాయకులు, పశుసంవర్థక, మత్స్యశాఖ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రగతిశీల రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు భాగస్వాములవుతారని తెలిపారు. ఈ సర్వే కోసం ప్రతీ మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి, ఒక అధికార బృందం రోజుకు 30 క్లస్టర్లు అంటే 90 ఇళ్లు సందర్శిస్తారన్నారు. ఒక్కో బృందం మొత్తం 540 కుటుంబాల వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ సమయంలో సీఎం సందేశం లేఖ, కరపత్రం కూడా రైతులకు అందజేస్తారన్నారు. ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఇంటింట ప్రచారంలో రైతుల నుంచి సేకరించిన సూచనలు, ఫిర్యాదులను ప్రణాళిక తయారుచేసి 3న ఆర్‌ఎస్‌కే స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఆమె వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్, జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో ఎస్.భాస్కరరెడ్డి, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్ల పశు సంవర్థక అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లిఖార్జునరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి టి.నిర్మలా కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి.. హాజరైన అధికారులు

సత్యసాయిబాబా శత జయంతి

రాష్ట్ర పండుగగా నిర్వహించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈమేరకు రెవెన్యూ, సత్యసాయి గురుకుల పాఠశాల, విద్యాశాఖ, సంగీత కళాశాల సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం సత్యసాయిబాబా జయంతి వేడుకలను జిల్లా, డివిజన్, నియోజకవర్గం, మునిసిపాలిటీ, మండల, సచివాలయ స్థాయిలో అధికారికంగా శత జయంతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలను నవంబరు 19 నుంచి 24 వరకు అత్యున్నత స్థాయిలో నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా 23న బాబా జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు అన్ని కేంద్రాలలో తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వీటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్వో భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో రాణిసుస్మిత, గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, డీపీఆర్‌వో ఎం. లక్ష్మణాచార్యులు, డీటీ శాస్త్రి పాల్గొన్నారు.

ట్రాఫిక్ టెర్రర్

» సిగ్నల్స్ దోబూచులాట » ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌లు » జిల్లా కేంద్రంలో తిప్పలు



రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ ఇలా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ట్రాఫిక్ పూర్తిగా నియంత్రణ కోల్పోయి తలపోటుగా మారింది. ప్రభుత్వశాఖల జిల్లా బాస్‌లు నిత్యం సంచరించే జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో మరీ అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లాలోని అధికశాతం కూడళ్లలో, ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో అసలు ట్రాఫిక్ సిగ్నల్సే లేవు. ఒకవేళ ఉన్నా వాటి నిర్వహణ దైవాధీనంగా ఉంది. నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో సిగ్నల్స్ ఊసేలేదు. సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ కమిషనర్, విద్యుత్తు ఎస్‌ఈ రోజూ తిరిగే జిల్లా కేంద్రంలో కూడా సిగ్నల్స్ డిస్కోలైట్లను తలపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ఇదే రోడ్లపై సంచరిస్తున్నా వారికి ఈ సమస్య కనబడడం లేదు. రాజమహేంద్రవరంలోని ముఖ్య కూడళ్లయిన కంబాల చెరువు, ఐటీ ఆఫీస్, లాలాచెరువు, డీటీసీ జంక్షన్, శ్యామలా సెంటర్, వీఎల్ పురం జంక్షన్, జాంపేట, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, కోటిపల్లి బస్టాండ్, తాడితోట, వీఎల్‌పురం జంక్షన్లలో సిగ్నల్స్ ఉన్నా అవి ఎప్పుడు మెలకువగా ఉంటాయో వాటికే తెలియడం లేదు. ఒక్కోసారి వెలిగినా ఓ అంకె కనబడితే మరో అంకె దాక్కుంటుంది. అడ్డంగా గీతలు వస్తుంటాయి. ఇక పార్కింగ్ ప్రదేశాలంటూ నిర్దేశించక పోవడంతో ఇష్టానుసారం వాహనాలను నిలిపేయడం పరిపాటిగా మారింది. సిగ్నల్స్ నిర్వహణ బాధ్యత రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్పొరేషన్‌లోని పట్టణ ప్రణాళికా విభాగం చూసుకుంటుంది. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకోవడం వరకూ బాగానే ఉన్నా.. నిర్వహణ విషయంలో అజమాయిషీ అంతంత మాత్రంగా ఉండడంపై విమర్శలు వినవస్తున్నాయి. మొత్తానికి ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకుంటూ ట్రాఫిక్‌ని మరింత జఠిలం చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాక్షాత్తూ జిల్లా పోలీసు కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న టీడీసీ జంక్షన్‌లో కూడా వాహనదారులతో సిగ్నల్స్ ఆటలాడుకుంటూ ఉంటాయి. ఇక్కడ పోలీసులు తమ ఇష్టానుసారం బారికేడింగ్‌లను మారుస్తూ ఉంటారు. ఈ జంక్షన్‌ని ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినా కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్‌ని సక్రమంగా పనిచేయించలేని దుస్థితి నెలకొంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు నరకం చూస్తున్నారు.

● గత ప్రభుత్వంలో..

గతంకంటే ట్రాఫిక్ విపరీతంగా పెరిగిన మాట వాస్తవమే. జిల్లా కేంద్రమైన తర్వాత రాజమహేంద్రవరంలో ఈ సమస్య మరీ ఎక్కువైంది. ఎక్కడైనా ట్రాఫిక్ పెరిగితే ఇబ్బందులు అధిగమించడానికి రోడ్లు, కూడళ్లు వెడల్పు చేస్తారు. కానీ, జిల్లాలో అందుకు భిన్నంగా గత వైసీపీ హయాంలో అభివృద్ధి పేరుతో రోడ్లు, జంక్షన్లను కుచించుకుపోయేలా చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. వాటికి అస్తవ్యస్త సిగ్నల్స్ నిర్వహణ మరింత ఆజ్యం పోస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో కంబాలచెరువు, ఐటీ ఆఫీస్ ఏరియాల్లో జంక్షన్ డవలప్‌మెంట్ పేరుతో చేసిన పనుల వల్ల వాహనదారుల ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. వీటిని తొలగిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రకటించినా.. మిగతా సమస్యల సంగతేంటని జనం ప్రశ్నిస్తున్నారు. కంబాల చెరువు నుంచి లాలాచెరువు వరకూ ఫుట్‌పాత్‌లపై బిళ్లలు అతికించి పూల కుండీలు ఏర్పాటు చేశారు. దీంతో చిరువ్యాపారులు రోడ్డుపైకి రాక తప్పలేదు. అసలే ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ రహదారి ప్రమాదకరంగా మారింది. జాంపేట ఆజాద్ చౌక్‌లో ఆర్టీసీ బస్సులు మలుపు తిరగడానికి నానాకష్టాలూ పడాల్సి వస్తోంది. ఈ ప్రదేశం ట్రాఫిక్ డీఎస్పీ కార్యాలయానికి సమీపంలోనే ఉండడం గమనార్హం.

● ట్రాఫిక్ సలహా కమిటీ ఏమైంది..

సాధారణంగా నగరంలో లేదా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రించడానికి ట్రాఫిక్ సలహా కమిటీ ఉంటుంది. దీనిలో మునిసిపాలిటీ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, నేషనల్ హైవేస్ తదితర శాఖలతోపాటు వ్యాపారులు ఉంటారు. ట్రాఫిక్ సమస్యలపై తాత్కాలిక చర్యలను మాత్రమే ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటారు. శాశ్వతమైన నిర్ణయాలను కమిటీ తీసుకుంటుంది. అయితే అసలు ట్రాఫిక్ సలహా కమిటీలు ఉన్నాయా? అంటే సమాధానం ముఖం చాటేస్తోంది. ట్రాఫిక్ నియంత్రణపై తగిన విధంగా ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ట్రాఫిక్ విభాగానికి ఒకే సీఐ ఉన్నారు. మరో పోస్టును చాన్నాళ్లుగా భర్తీ చేయడం లేదు. సిబ్బంది కొరత ఉండనే ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

గ్రామీణ రైతులకు రుణాలు ఇవ్వాలి

డీసీసీబీ చైర్మన్ రామస్వామి

రాజమహేంద్రవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ప్రెసిడెంట్లు గ్రామీణ రైతులకు అందుబాటులో ఉండి వారికి రుణాలు ఇవ్వడానికి సహకరించాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం జరిగిన ఆప్కాబ్, సొసైటీ ప్రెసిడెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ సమష్టిగా కృషిచేసి బ్యాంక్‌ను లాభాలబాటలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డీసీసీబీ బ్యాంక్ సీఈవో ప్రవీణ్‌కుమార్, ఏపీసీవోబీ ఫ్యాకల్టీ రమణారావు, సీటీ సత్యనారాయణరాజు, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో వైద్యంపై సీఎం సీరియస్

» విచారణకు ఆదేశం » జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంతోనే ఘటన
» జీజీహెచ్‌కు ఎలాంటి సంబంధం లేదు : సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వైద్యం కోసం వచ్చిన 55 ఏళ్ల వ్యక్తికి కాలంచెల్లిన టాబ్లెట్లు ఇవ్వడంతో వాటిని వాడి ఆ వ్యక్తి తీవ్ర అనారోగ్యం పాలైనట్టు వచ్చిన సమాచారంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఏడాది అక్టోబరులో ఎక్స్‌పైర్ అయిన మందులను నవంబరు 8న సదరు రోగికి వైద్య సిబ్బంది ఇచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై సీఎం సీరియస్‌గా స్పందిస్తూ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వచ్చిన ఆదేశాలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో తీవ్ర కలకలం రేపింది. ఈ విషయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు స్పష్టమవుతోందని భావిస్తున్నారు. ఇటు రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యవర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. అయితే దీనిపై జీజీహెచ్‌కు ఎలాంటి సంబంధంలేదని, అసలు ఆ వ్యక్తి జీజీహెచ్‌లో ట్రీట్‌మెంట్ తీసుకోలేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ స్పష్టంచేశారు. తమ డ్రగ్ స్టోర్‌లో ఉన్న అన్ని మెడిసిన్స్‌ను నిశితంగా పరిశీలించామని, అసలు ఆ బ్యాచ్ టాబ్లెట్లు తమ వద్ద లేవని తెలిపారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులకు వైద్యసేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, అసలు ఆ వ్యక్తి ఎవరో కూడా తమకు తెలియదని, ఆసుపత్రిలో వైద్యం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే ఈ ఘటన జరిగినట్టు ప్రాథమికంగా భావిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక అర్బన్ హెల్త్‌సెంటర్లో ఇచ్చిన టాబ్లెట్లు వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలిసింది. నారాయణపురంనకు చెందిన ఒక వ్యక్తి వైద్యం కోసం వెళ్లినపుడు అర్బన్‌హెల్త్‌సెంటర్ వైద్యసిబ్బంది అతనికి కాలం చెల్లిన టాబ్లెట్లను ఇచ్చినట్టు తెలిసింది. ఇది బీపీ కోసం వాడే టాబ్లెట్ అని సమాచారం. కాకినాడ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి గత ఏడాది జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు ఈ టాబ్లెట్లు సరఫరా జరిగాయని చెబుతున్నారు. ఈ ఘటనపై సీఎం సీరియస్ కావడంతో విజయవాడలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ అధికారి ఒకరు శనివారం ఇక్కడికి వచ్చి దీనిపై విచారణ జరిపారు. కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి కూడా ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

గోదావరి మధ్యలో మత్స్యకారుల పూజలు 6

మన్యంలో ముందస్తు జాగ్రత్తలు

మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై నిరసన నేపథ్యంలో పోలీసుల భారీ భద్రతా ఏర్పాట్లు

రంపచోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి అడవుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందిన ఘటనలకు నిరసనగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు, పలు ప్రజాసంఘాలు ఆదివారం ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రంప మన్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆదివారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలను, మాజీ ఎంపీలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించి నివాసాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ఆయా పోలీసుస్టేషన్లకు కూడా భద్రతను పెంచారు. ఇదిలాఉండగా ఆర్టీసీ ముందు జాగ్రత్తగా మన్యానికి వచ్చే కొన్ని సర్వీసులను రద్దుపర్చింది. మారేడుమిల్లి ఎగువ ప్రాంతానికి, చింతూరు ఘాట్ రోడ్లపైకి వాహనాలను నిరోధించే యోచనలో కూడా పోలీసులు ఉన్నారు. ఇక టూరిస్టులు కూడా రాకపోవడం మంచిదన్న సూచనలు కూడా వస్తున్నాయి.

చింతూరు మీదుగా రాకపోకల బంద్



చింతూరు- భద్రాచలం నడుమ హైవేపై చింతూరు పోలీసుల బందోబస్తు

చింతూరు, నవబంరు 22 (ఆంధ్రజ్యోతి): హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆదివారం దేశవ్యాప్తంగా నిరసన పాటించాల్సిందిగా మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదలైన విషయం విదితమే. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నుంచే చింతూరు మీదుగా సాగే వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అత్యవసర పరిస్థితి క్రమంలో వయా కూనవరం మీదుగా రాకపోకలకు అనుమతి ఇస్తున్నారు. మన్యంలో పోలీసులు నిఘా పెంచారు. ఆ మేరకు కూంబింగులు చేస్తున్నారు.

జ్యోత్స్న అకాల మృతి బాధాకరం

తునిలో ఉపాధ్యాయురాలి కుటుంబాన్ని పరామర్శించిన హోం మంత్రి అనిత



తునిలో జ్యోత్స్న కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అనిత

తుని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు జ్యోత్స్న అకాల మృతి బాధాకరమని, ఉపాధ్యాయురాలు పిల్లలకు వచ్చిన కష్టం తలుచుకుంటే చాలా బాధగా ఉందని హోం మంత్రి అనిత భావోద్వేగానికి గురయ్యారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరంలోని జడ్పీ హైస్కూల్లో భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం జరిగి తునికి చెందిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్న మృతిచెందడంతో శనివారం తుని బ్యాంక్ కాలనీలో ఆమె పార్థివదేహానికి హోం మంత్రి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జ్యోత్స్న ఇద్దరి పిల్లలను చూసి చలించిపోయారు. వారిని దగ్గరకు తీసుకుని చదువుకు సంబంధించిన విషయాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పిల్లల చదువు, ఉద్యోగానికి సంబంధించిన కొన్ని వెలుసుబాటును కుటుంబ సభ్యులు హోంమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారని, ఉపాధ్యాయురాలు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హోం మంత్రి తెలిపారు. ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సకాలంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయురాలి పెద్ద అబ్బాయి ప్రస్తుత ఉద్యోగ అర్హత వయస్సు రాకపోవడంతో రెండేళ్ల తరువాత ఉద్యోగం ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. యనమల రాజేష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్ ఉన్నారు.

గోదావరి మధ్యలో మత్స్యకారుల పూజలు

పాలు పొంగించి భైరవస్వామికి నైవేద్యం సమర్పణ



నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న మత్స్యకారులు

యానాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యానాంలో గోదావరి మధ్యలో (ఐలాండ్) మత్స్యకారులు పూజలు నిర్వహించారు. యానాంలోని కొత్తపేట, అగ్రహారం, ప్రాన్స్‌తిప్ప గ్రామల మత్స్యకారులు ప్రతీ సంవత్సరం గోదావరి నీరు తగ్గిన తర్వాత వేటకు బయలుదేరే ముందు గోదావరి మధ్యలో ఉన్న ఐలాండ్‌లో భైరవస్వామికి పాలు పొంగించి నైవేద్యం సమర్పించే పవిత్ర సంప్రదాయాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నావలో ఐలాండ్‌కు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం మత్స్యకారులందరూ పాలు పొంగించిన నైవేద్యాన్ని భైరవస్వామి) సమర్పించారు. మత్స్యకార ప్రతినిధి మల్లాడి శామ్యూల్, గ్రామ పెద్దలు ఉన్నారు.



నావలో వెళ్తున్న మల్లాడి కృష్ణారావు

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజల అనంతరం తూర్పురాజగోపురం వద్ద కు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

పెదపట్నంలంకలో 'రాజీ.. నో కాంప్రమైజ్'

సినిమా షూటింగ్ ప్రారంభం

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెదపట్నంలంకలో రాజీ... నో కాంప్రమైజ్ అనే సినిమా షూటింగ్ శనివారం ప్రారంభించారు. వినాయకుడికి పూజలు నిర్వహించిన అనంతరం దర్శకుడు గెద్దాడ ప్రసాద్ చిత్రీకరణను ప్రారంభించారు. రాజీ... మంచి మొగుడు కావాలని దేవుడికి దణ్ణం పెట్టుకో అమ్మా అంటూ కథానాయిక జయశ్రీకి తండ్రి పాత్రధారి రాజీవ్ కనకాల చెప్పిన సీన్‌తో షూటింగ్ ప్రారంభమైంది. కుటుంబ కథా చిత్రంగా సాగే ఈ చిత్రాన్ని 4రోజులు పెదపట్నంలంకలో చిత్రీకరిస్తామని దర్శకుడు తెలిపారు. పల్లెటూరు వాతావరణంలో సాగే ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. షూటింగ్‌ను తిలకించడానికి స్థానికులు ఆసక్తి కనబరిచారు.





పెదపట్నంలంకలో రాజీవ్ కనకాల, హీరోయిన్‌పై చిత్రీకరిస్తున్న సన్నివేశాలు

జైల్లో పరిచయం.. నిత్యం దొంగతనాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

- నల్లజర్లలో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- నల్లజర్ల, ప్రతిపాడు, తణుకులో చోరీలు చేసినట్టు గుర్తింపు
- ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు
- రూ.3 లక్షల నగదు, బంగారం, రెండు బైక్‌ల స్వాధీనం

నల్లజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో పలు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆరుగురు దొంగలను ప్రవేశపెట్టారు. వారి నుంచి రూ.3 లక్షల నగదు, బంగారం చైన్, 2 గాజులు, కారు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

నెల్లూరుకు చెందిన షేక్‌ఫక్రుద్దీన్ ఒంగోలు జైలులో ఉన్నప్పుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కేసు ఉమ్రా మోహదా (హోలీటీడా పంచాయతీ, గంధవాన్ మండలం, ధార్ జిల్లా) రాగస్ మదవ్ హటిలా, బారిక్‌సింగ్ ఆజీనార్, ముహరు కల్లు మహదా, హీరు హరియా అజీనార్‌తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత ఏపీలో సంపన్నులు ఉంటారని, చోరీలు చేద్దామనుకుని నిర్ణయించుకున్నారు. దీంతో సెప్టెంబరు 24వ తేదీ అర్ధరాత్రి తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో ఒంటరిగా నివసిస్తున్న పాకలపాటి సుభద్ర ఇంటి తలుపులు పగుల గొట్టి ఆమె మెడలోని బంగారు అభరణాలను దోచుకుపోయారు. అంతకుముందు కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని సురేష్ జ్యూయలరీ షాపులో 11 కిలోల వెండి, బైక్ దొంగతనం చేశారు. తర్వాత నల్లజర్లకు 2బైక్‌లు, కారుతో వచ్చి ఇక్కడ కూడా చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత ఖమ్మం వెళ్లి అక్కడి నుంచి మధ్యప్రదేశ్‌కు రైలులో పారి పోయారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, దేవరపల్లి సీఐ నాయక్ ఆధ్వర్యంలో 2బృందాలు మధ్యప్రదేశ్ వెళ్లి గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఫక్రుద్దీన్ కదలికలపై నిఘాపెట్టారు. ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం నల్లజర్లలో పోతవరం కుడి కాల్వ గట్టుపై అనుమానాస్పదంగా కొంతమంది తిరుగుతున్నట్టు నల్లజర్ల సీఐ రాంబాబుకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. విచారణ అనంతరం అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించుకుని వారి వద్ద నుంచి సొత్తును రికవరీ చేశారు. కష్టపడి పనిచేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. వీరిని ధార్ ముఠాగా పిలుస్తారని, మధ్యప్రదేశ్‌లోని 4 గ్రామాల్లో కలిసి ఉంటూ నిత్యం దొంగతనాలు చేయడం, పోలీసులు వెళితే వారిపై దాడులకు పాల్పడడం, అవసరమైతే చంపేయడం వంటివి చేస్తారని డీఎస్పీ పేర్కొన్నారు. వీరు గతంలో పోలీసు అధికారులపై ఫైర్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. తణుకులో కూడా చోరీ చేసినట్టు గుర్తించారు. ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సీఐలు నాయక్, రాంబాబు, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కోపంతో మామను తోసేసిన అల్లుడు

కొద్దిగంటలకే మృతి

కేసు నమోదు



మృతిచెందిన అప్పలరాజు

ధవళేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు గొడవ పడుతుండగా మధ్యలో ఆపడానికి వచ్చిన మామను అల్లుడు తోసివేయడంతో రోడ్డుపై పడిన మామ కొద్ది గంటల తరువాత మృతిచెందాడు. ఈ మేరకు అతడి కుమార్తె సప్పిడి ధన నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లుడి సప్పిడి నివాస్‌ను ధవళేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన ధన నాగమణిని సప్పిడి శ్రీనివాస్ 5 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని ఒక అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కాపురం పెట్టాడు. కొద్దికాలం తరువాత భార్యపై అనుమానంతో కొట్టడం, తిట్టడం చేస్తుండటంతో నాగమణి భర్తను వీడి ధవళేశ్వరంలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. ఆపై భర్త రమ్మనడంతో మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోయింది. మళ్లీ భార్యభర్తలు హైదరాబాద్‌లో గొడవపడి ధవళేశ్వరం చేరుకున్నారు. ఈ క్రమంలో నివాస్ శుక్రవారం రాత్రి మళ్లీ గొడవకు దిగడంతో అడ్డు వెళ్లిన మామ బక అప్పలరాజు (58)ను కోపంతో తోసివేశాడు. దీంతో రోడ్డుపై పడిపోయాడు. పైకి ఎటువంటి గాయం కనిపించకపోవడంతో ఇంటిలోకి వెళ్లి పడుకున్నారు. అర్ధరాత్రి అప్పలరాజుకు వెక్కిళ్లు రావడంతో కుమార్తె మంచినీళ్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తుండగా మృతిచెందాడు. ధవళేశ్వరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నివాస్‌పై ఐ498ఏ సెక్షన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజోలు స్కౌట్ మాస్టర్‌కు 'జాతీయ జంబోరి' ఆహ్వానం



గోపాలకృష్ణ

రాజోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్నోలో ఈ నెల 23 నుంచి 29 వరకు జరిగే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జాతీయ జంబోరి 75 సంవత్సరాల డైమండ్ జూబ్లీ వేడు కలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన విశ్రాంత ఎంఈవో, స్కౌట్ మాస్టర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణకు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా ఆయన విలే కర్లతో మాట్లాడుతూ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా ఆదేశాల మేరకు తనతో పాటు తాటిపాక హైస్కూలు స్కౌట్ మాస్టర్ యెరుబండి నాగేశ్వరరావుకు ఆహ్వానం లభించిందని తెలిపారు. లక్నోలో జంబోరీకి వెళ్లిన జొన్నలగడ్డ, యెరుబండిని స్కౌట్స్ అండ్ గైడెడ్ కోఆర్డినేటర్ కె.కృష్ణప్రసాద్, ఏఎంవో రాంబాబు,దుర్గామాధవి పలువురు అభినందించారు.

అయినవిల్లిలో కేరళ డీజీపీ పూజలు

అయినవిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ డీజీపీ రావడ ఆజాద్‌చంద్ర శేఖర్ శనివారం కుటుంబ సమేతంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను డీజీపీకి అందజేశారు.



కేరళ డీజీపీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

అన్నవరంలో తప్పిన ప్రమాదం

దేవస్థానం బస్సును ఢీకొన్న బొలేరో వాహనం

గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న భక్తులు

అన్నవరం. నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి కొండపైకి తీసుకెళ్తున్న దేవస్థానం బస్సులో భక్తులకు ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం 10గంటల సమయంలో అన్నవర దేవస్థానం బస్సు భక్తులను రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వద్ద నిలపగా వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో బస్సు కుదుపునకు గురవడంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గండిపోశమ్మ దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో వెలసిన స్వయంభూ గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, ఆలయ పరిసరాలు బురదతో నిండి ఉన్నాయన్నారు. దీని దృష్ట్యా దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశామని దర్శనాలకు అనుమతించే తేదీ ప్రకటించే వరకు భక్తులు ఆలయ పరిసరాలకు రావద్దన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

మండపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కేపీరోడ్డులో శనివారం కారు ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కడియం మండలం మురమండకు చెందిన పి.కాంతమ్మ(70) మండపేట కేపీరోడ్డులో యాచక వృత్తి చేసుకుంటూ జీవిస్తుంది. శనివారం ఆమెను మారేడుబాక నుంచి వాడపల్లికి వెళ్తున్న కారు ఢీకొనగా తీవ్రగాయాలపాలై మృతిచెందింది. ఘటనపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.



వృద్ధురాలి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కాకినాడలో అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

13 జిల్లాల నుంచి 130మంది హాజరు



ఖోఖో ఆడుతున్న తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల క్రీడాకారులు

కార్పొరేషన్ (కాకినాడ సిటీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలకు క్రీడామైదానం ఉండేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఈ విషయంపై అసెంబ్లీలో చర్చిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం పాఠశాల క్రీడాసమాఖ్య అండర్ 14, 17 ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అం తర్ జిల్లాల ఖోఖో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ, డీఎస్‌డీవో బి.సతీష్‌కుమార్, ఖోఖో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జానకిరామయ్య, జిల్లా ఖోఖో సంఘ అధ్యక్షుడు పట్టాభిరాం, టీడీపీ నాయకులు బి.కృష్ణమోహన్, ఎన్.గోవిందు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు క్రీడా రిజర్వేషన్‌ను 3శాతానికి పెంచారన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవిలో కాకినాడ బీచ్‌లో జాతీయస్థాయి పోటీల నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని పీడీలను కోరారు.





పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

డీఎస్ఏ ఖోఖో కోర్టుల్లో ఫ్లడ్‌లైట్లు సౌకర్యం కల్పించాలని ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీను ఎమ్మెల్యే నానాజీని కోరగా పంతం ఫౌండేషన్ నుంచి ఫ్లడ్ లైట్లు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసి న క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అడ్మిన్ సెక్రటరీ సుధారాణి, సంఘ ప్రతినిధులు వాసు, స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ లంకా జార్జి, మాచరరావు, రాజశేఖర్, నూకరాజు, సురేష్‌రాజు, దిశ ఛైర్మన్ స్వరాజ్యలక్ష్మి, జేఎన్‌టియూకే పీడీ శ్యాంకుమార్ పాల్గొన్నారు.

జూడో పోటీలు...

తూర్పుగోదావరి జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో పోటీలు కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని ఇండోర్ హాల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. గౌరవ అతిథులుగా జూడో సంఘ ఛైర్మన్ వెలగ వెంకట కృష్ణారావు, రాష్ట్ర ఖోఖో సంఘ సీఈవో వెంకట నాగశెట్టి, రాష్ట్ర కార్యదర్శి పవన్ సందీప్, డీఎస్‌వో సతీష్‌కుమార్ హాజరయ్యారు. కాకినాడ జిల్లా జూడో సంఘ కార్యదర్శి టీవీవీ రమణ అధ్యక్షత వహించారు. వెంకట కృష్ణారావు మాట్లాడుతూ జూడో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు 2రోజులు భోజన సదుపాయం కల్పిస్తున్నారన్నారు. బాలుర, బాలికల విభాగంలో చెరో ఏడు వెయిట్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. డీఎస్ఏ జూడో కోచ్ తేజ, వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



క్రీడాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటీఎంకు నిప్పు పెట్టాడు!

రెండు ఏసీలు దగ్ధం

పిఠాపురంలో అగంతకుడి దుశ్చర్య



ఏటీఎంలో కాలిపోయిన పరికరాలు, పేపర్లు

పిఠాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఒక అగంతకుడు ఏటీఎంకు నిప్పు పెట్టాడు. 2ఏసీలు, ఏటీఎం కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున 3.30-4గంటల మధ్య జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కాకినాడ జిల్లా పిఠాపురం మెయిన్ రోడ్డులో గల చర్చి సెంటర్ సమీపంలో సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ వద్దే ఏటీఎం ఉంది. శనివారం తెల్లవారుజామున అగంతకుడు ఏటీఎంకి వచ్చాడు. బయట నుంచి కాగితాలు తెచ్చి ఏటీఎం వద్ద వేసి నిప్పు పెట్టాడు. దీంతో ఏటీఎంతో పాటు అదే ఆవరణలో ఉన్న రెండు ఏసీలు కాలిపోయాయి. విషయాన్ని గమనించిన స్థానికులు, ఫైర్ అలర్ట్‌తో బ్యాంకు ఉన్నతాధికారులు పోలీసులు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్యాస్ సహాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఏసీలతో పాటు ఏటీఎం పాక్షికంగా, లోపల ఉన్న ఇతర పేపర్లు కాలిపోయాయి. నగదు కూడా కాలిపోయిందని సమాచారం. కాగా ఘటనకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి మతిస్థిమితం లేదని పోలీసులు చెప్తున్నారు. అయితే ఏటీఎంకు నిప్పు పెట్టే సమయంలో పట్టణంలోని ఇతర ఏటీఎంలను ఇదేవిధంగా కాల్చివేస్తానని ఆ ఆగంతకుడు చెప్పినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. సంఘటనపై బ్యాంకు మేనేజరు సాయిసుధ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలు సేకరించి విశ్లేషించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా ఏటీఎం పరిశీలన నిమిత్తం శనివారం రాత్రి నిపుణులు వచ్చారు.

ఏరియా ఆసుపత్రి వద్ద రోగి మృతి



స్వామి అయ్యప్ప మృతదేహం

అనపర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో ఇన్‌పేషెంట్‌గా ఉండి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం తెల్లవారుజామున అదే ఆసుపత్రి భవనం వద్ద మరణించాడు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి సావరంకు చెందిన చెంకాని స్వామి అయ్యప్ప (44) మద్యానికి బానిసై ఇటీవల అనారోగ్యం పాలయ్యాడు. 4 రోజుల క్రితం అతడి తల్లి లక్ష్మి అయ్యప్పను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేర్పించింది. శుక్రవారం రాత్రి నుంచి అయ్యప్ప పరాకు మాటలు మాట్లాడుతూ కేకలు వేశాడు. ఇది గమనించి తెల్లవార్లు కంట కనిపెడుతూ వచ్చింది. తెల్లవారుజామున కొడుకు మంచంపై లేకపోవడంతో అంతా వెతికినా ఆచూకీ లభించలేదు. ఉదయం ఆసుపత్రి ప్రహరీ పక్కన కొడుకు మృతదేహం ఉన్నట్టు సిబ్బంది తెలపడంతో చూసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

పీడీజే గంధం సునీత


విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు మంచి, చెడు స్పర్శల గురించి, నల్సా-పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవల పథకం-2024పై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకొని కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, మోస పూరితంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లల పట్ల ఏ ఒక్కరూ హద్దులు దాటి ప్రవర్తించడానికి వీల్లేదన్నారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉన్నా నల్సా హెల్ప్‌లైన్ నెంబరు 15100కి లేదా డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

జీజీయూలో ముగిసిన ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ

రాజానగరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రిక్, హైడ్రోజన్ పవర్ వెహికల్స్ అనే అంశంపై వారం రోజులుగా జరుగుతున్న ఏఐసీటీఈ అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ శనివారం ముగిసింది. ఈ సదస్సులో యూనివర్శిటీ ఆఫ్ హూస్టన్ నుంచి కౌశిక్ రాజశేఖర, న్యూవరల్డ్ గ్రాఫైట్ నుంచి ఎంవీ రెడ్డి, సెంటర్ ఫర్ ఫ్యూయల్ టెక్నాలజీ నుంచి బాలాజీ రంగరాజన్, కొరియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ నుంచి అమర్నాథ్ వర్మ తదితర ప్రధాన వక్తలు పాల్గొని మాట్లాడారు. ఎలక్ట్రిక్ వెహికల్ ఆర్కిటెక్చర్స్, ఫ్యూయల్ సెల్, హైడ్రోజన్ జనరేషన్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఇతర అంశాలపై మొత్తంగా 13 సెషన్‌లను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పరిశ్రమల ప్రముఖులు, అలాగే జీజీయూ వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ టి.జయానందకుమార్, కన్వీనర్ వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

బయోకాన్ ఫార్మా శాస్త్రవేత్త శ్రీనివాస్.. ఆర్ట్స్‌లో ముగిసిన పర్యావరణ సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని బయోకాన్ ఫార్మా బెంగుళూరు శాస్త్రవేత్త కలిదిండి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు' రెండు రోజుల సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సులో శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ సహిత పరిశోధన విశేషాలను విద్యార్థులకు వివరించారు. రీసెర్చ్ సైంటిస్టు రామకృష్ణ, శ్రీనివాస ఆన్‌లైన్‌లో తమ పరిశోధనలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల జేడీ సీహెచ్ కృష్ణ, తదితరులు మాట్లాడారు. విద్యార్థుల పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. సదస్సు కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.శ్రీధర్, తేజస్విని, రసాయనశాస్త్ర విభాగ అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజానగరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని 17 కుటుంబాలకు మంజూరైన నగదు చెక్కులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తన కార్యాలయంలో నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మితో కలిసి శనివారం అందజేశారు. వెలుగుబందలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన అదే గ్రామానికి చెందిన కేతమోలు సతీష్‌కు చికిత్స నిమిత్తం రూ.3.50 లక్షలు, శ్రీరాంపురంలో రూ.1,09,613, చక్రద్వారబంధంలో రూ.61,112, తూర్పుగోనగూడెంలో రూ.30 వేలు, కలవచర్లలో రూ.18 వేలు, కొండగుంటూరులో రూ.31,580, ముక్కినాడలో రూ.35,181, పాలచర్లలో రూ.65 వేలు, పుణ్యక్షేత్రంలో రూ.57,918, రాజానగరంలో రూ.1,26,585, శ్రీకృష్ణపట్నంలో రూ.89,474, తోకాడలో రూ.25,084, మల్లంపూడిలో రూ.35,787, నగదు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ఇరిగేషన్ క్వార్టర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కడియం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వేమగిరి వంతెన దాటిన తరువాత చికెన్ మార్కెట్ సమీపంలో ఇరిగేషన్ శాఖ పాడుపడిన క్వార్టర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. సుమారు 20 నుంచి 30 ఏళ్ల వయసున్న వ్యక్తి వేమగిరి ప్రాంతంలో బాటిల్స్ ఏరుకుని జీవించే వాడని తమకు తెలిసిందని పోలీసులు తెలిపారు. పెద్ద రాయితో తలపై బలంగా కొట్టి చంపినట్టు మృతదేహాన్ని బట్టి తెలుస్తోందన్నారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఎస్‌హెచ్‌వో 94407 96587 నెంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

దుళ్లలో అగ్ని ప్రమాదం

కడియం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దుళ్ల దళితవాడలో అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లింది.స్థానికుల సమాచారం ప్రకారం శనివారం గుర్రపు వెంకట్రావు కూలిపనులకు వెళ్లి వచ్చాడు. భోజనం చేసిన తర్వాత టీవీ చూస్తూ నిద్రపోయాడు. దీంతో టీవీ ఓవర్ హీట్ అయ్యి షార్ట్ సర్క్యూట్‌కు గురై ఉండవచ్చని భావిస్తున్నారు. నిద్రలో ఉన్న వెంకట్రావు విషయాన్ని గమనించలేదు. ఇల్లంతా పొగతో కమ్మేసింది. ఊపిరి పీల్చుకోలేక భారంగా మారడంతో మెలకువ వచ్చి బయటకు పరుగులు తీశాడు.ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడం, డాబా ఇల్లు కావడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని దుస్తులు, ఎలక్ట్రికల్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు మంటలను అదుపు చేశారు.

సంఘ బలోపేతంతో సమస్యలు పరిష్కారం

ఏపీఎన్‌జీవో జిల్లా చైర్మన్ మాధవరావు.. కలెక్టరేట్ ఉద్యోగుల నుంచి సభ్యత్వాల నమోదు


కలెక్టరేట్‌లో ఎన్జీవో సంఘం సభ్యత్వాలు స్వీకరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాలు బలోపేతమైతే సమస్యలు వాటికవే పరిష్కారమవుతామని ఏపీ ఎన్‌జీవో సంఘం జిల్లా కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు అన్నారు. ఏపీఎన్ జీవో సంఘ సభ్యత్వాలకు సంబంధించి శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగుల నుంచి సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 74 ఏళ్ల చరిత్ర కలిగిన ఏపీఎన్‌జీవో సంఘం ఉద్యోగులకు ఎన్నో సౌకర్యాలు కల్పించిందని భవిష్యత్‌లో మరెన్నో ప్రయోజనాలు పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వంతో పోరాడి డీఏ సాధించాయని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుకు విద్యాసాగర్ నేతృత్వంలో చర్చలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవరావు, అనిల్‌కుమార్, సత్యమూర్తి, ఆనంద్, వెంకట్రావు, కుమార్, దివ్య, మౌనిక పాల్గొన్నారు.

నగరంలో సేవా కార్యక్రమాలు

గన్ని కృష్ణ పుట్టినరోజు.. అభిమానుల దాతృత్వం


గన్ని కృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు శనివారం నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత శ్రీరామ్‌నగర్‌లో గన్ని నివాసం వద్ద ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మజ్జి రాంబాబు, కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, పంతం రజనీశేషసాయి, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వైశ్రీను, మరుకుర్తి రవియాదవ్, అన్నెం రామకృష్ణ, స్మిత సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం మహిళకు చీరలు పంచారు. గోదావరి గట్టు అయ్యప్పస్వామి ఆలయాన్ని దర్శించుకుని నిత్యాన్నదానానికి ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మి రామకృష్ణ, కాసాని అప్పారావులకు ట్రైసైకిల్స్ అందించారు. ప్రియదర్శిని పాఠశాలలో అల్పాహారం అందించారు. అన్న క్యాంటీన్లలో అన్నదానాలు చేశారు. గన్ని కృష్ణకు యాళ్ల ప్రదీప్, మళ్ల వెంకట్రాజు, రెడ్డి మణి, జవ్వాది మురళీకృష్ణ, కొసూరి చండీప్రియ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బిక్కవోలులో చురుగ్గా షష్ఠి ఉత్సవ పనులు


52 అడుగుల ఎత్తులో తయారవుతున్న స్వాగతద్వారం

బిక్కవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 25 నుంచి వచ్చే నెల 2వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామని, 26న షష్ఠి ఉత్సవం జరుపుతామని ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా బిక్కవోలు వంతెన వద్ద నుంచి జి.మామిడాడ వెళ్లే రోడ్డు వరకూ రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తున్నారు. ఆలయం ఎదుట భారీ చలువ పందిరి నిర్మిస్తున్నారు. 52 అడుగుల ఎత్తులో భారీ స్వాగత ద్వారం నిర్మిస్తున్నారు. బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో కూడా భారీ ఎత్తున అరపలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో తయారుచేసిన దేవతామూర్తులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన పద్మనాభస్వామి, అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వరుడు అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన

రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవ ఏర్పాట్లను శనివారం దేవదాయ శాఖ ఉపకమిషనర్ డీఎల్ వీ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవ కమిటీ సభ్యు లు, అధికారులతో చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించాలని, వృద్ధులు, చంటి పిల్లల తల్లులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకెళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఉప కమిషనర్ రమేష్

ఎన్‌కౌంటర్‌పై సుప్రీం జడ్జితో విచారణ జరపాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరంలో న్యూడెమోక్రసీ నాయకుల నిరసన ధర్నాలో

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు డిమాండ్ చేశారు. మారేడుమిల్లి అడవుల్లో జరిగినట్టు చెబుతున్న ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పల్ల వెంకట నాయుడు, రాష్ట్ర నాయకులు మండవ దుర్గాప్రసాద్, సీఎల్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ, బీఎస్పీ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి,న్యాయవాది ఇసుకపట్ల రాంబాబు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనిపెల్లి సత్తిబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.యేసు, పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మంగాదేవి, నక్క వెంకటరత్నం, నాగేశ్వరరావు,బాలరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండవ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హిడ్మా, ఆయన సహచరి రాజీ, మరో పదకొండు మందిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిం చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అడవుల నుంచి ఆదివాసీలను గెంటివేసే చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగంలో హక్కులను ప్రజలకు అందించాల్సిన వారే ఆదివాసీలను, మూలనివాసులను పేద దళితులను ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేయడం సరికాదన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం ఏజెన్సీలో నేషనల్ పార్క్ పేరుతో ఏకోసెన్సిటివ్ జోన్ పేరుతో గిరిజన గ్రామాల తొలగింపు ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని జనిపల్లి సత్తిబాబు డిమాండ్ చేశారు.

రంగంపేటలో 611 పనులు గుర్తింపు

- 146 జాబ్‌కార్డుల మంజూరు
- ఏపీవో నాగశేషు
- ఉపాధి హామీ గ్రామ సభలు

రంగంపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెగా గ్రామ సభలు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోనూ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీవీ సాయిబాబు రంగంపేట పంచాయతీలో జరిగిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉపాధి కూలీల జాబ్‌కార్డులన్నింటికీ ఈకేవైసీ చేశారన్నారు. వివిధ కారణాలతో 2000 కార్డులు రద్దయ్యాన్నారు.ఏపీవో నాగశేషు మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 12 వేల జాబ్‌కార్డులు ఉండగా వాటిలో 2 వేల కార్డులు రద్దయ్యాయని, కొత్తగా 146 కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. 98 జాబ్‌కార్డులు పునఃరుద్ధరణకు ప్రపోజల్స్ తీసుకున్నామని, 611 పనులను గుర్తించినట్టు పేర్కొన్నారు. ఈ సభల్లో కూటమి నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.


రంగంపేట: చండ్రేడు సభలో మాట్లాడుతున్న ఏపీవో నాగశేషు

తూతూ మంత్రంగా ఉపాధి హామీ గ్రామసభలు


బొమ్మూరు సభలో మాట్లాడుతున్న కార్యదర్శి

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 21ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సేవలను ప్రజల ముం దుకు తీసుకొచ్చేందుకు గ్రామసభలు నిర్వహించారు. ప్రజలకు పారదర్శకతను చేరువ చేయడం, సేవలను గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం, కొత్త జాబ్‌కార్డుల దరఖాస్తులను స్వీకరించడం, ఇటీవల ఈకేవైసీ సమస్యల కారణంగా రద్ద యిన, లేక తొలగించిన జాబ్‌కార్డులను పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరించడం ఈ సభల ముఖ్య ఉద్దేశ్యం. శనివారం జిల్లా వ్యాప్తంగా డ్వామా పీడీ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలు నిర్వహించారు. అయితే రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఒకటి, రెండు గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో తూతూ మంత్రంగానే నిర్వహించారు. ఉపాధి కూలీలు లేక సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కుర్చీలు నింపారు. ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేకాధికారిని నియమిస్తూ వివిధ శాఖలకు చెందిన అధికారులకు ఎంపీడీవో సర్క్యులర్ జారీచేశారు. తొర్రేడు గ్రామంలో జరిగిన సభకు ప్రత్యేకాధికారి హాజరు కాలేదు.

స్వదేశీ వస్తువులనే వాడుదాం: నల్లమిల్లి


అనపర్తిలో ఇంటింటా స్వదేశీ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): ప్రతీ ఇంటా స్వదేశీ వస్తువులనే వాడదామని, దేశ ఆర్థికాభివృద్ధికి చేయూతనిద్దామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నియోజవర్గ స్థాయిలో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే అధ్యక్షత వహించి మాట్లాడుతూ దేశంలో తయారయ్యే వస్తువులకు ప్రాధాన్యమివ్వడం ద్వారా ఇక్కడ పరిశ్రమలు పెరిగి ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని తద్వారా దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో అడబాల రామకృష్ణ, శివరామకృష్ణంరాజు, మల్లిడి సురేంద్ర రెడ్డి,గొల్లు హేమతులసి, ఆళ్ల గోవిందు, సిరసపల్లి నాగేశ్వరరావు, జుత్తుక సూర్యకుమారి, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉమాకోటిలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా రమణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిలింగాలపేట ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం శనివారం రాత్రి జరిగింది. దేవస్థానం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విచ్చేసి దేవస్థానం చైర్మన్‌గా కొయ్యల రమణ, సభ్యులుగా పిల్లి ప్రసాద్, జోన్న సత్యవతి, అలజంగి దేవుడు, నిమిషికవి, గుబ్బల గంగాభవాని, జీవీఆర్ రెడ్డి, తోట కిరణ్, మద్దుకూరి అనురాధా, ముంగండ త్రివేణి, సమ్మంగి లక్ష్మిదుర్గాలతో ప్రమాణస్వీకారం చేయించారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని, విశిష్టతను మరింత పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసును, కొయ్యల రమణలను గజమాలతో సత్కరించారు. గత ప్రభుత్వం రమణను ఎంతో ఇబ్బంది పెట్టిందని, అన్నింటిని తట్టుకుని నిలబడి కూటమి విజయానికి రమణ కృషి చేశారన్నారు. నూతన కమిటీకి పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

కోరుకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీరంగపట్నం సొసైటీ పరిధిలోని శ్రీరంగపట్నం, కోటి, కోటి కేశవరం, బుల్లెద్దు పాలెం రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొలుగోళ్లు ప్రారంభించారు. కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ అడపా వీరబాబు, మెంబర్స్ కొయ్యడాల వెంకటేశ్వరావు, దొడ్డి మంగ అప్పలరాజు, నాయకులు మద్దాల అమ్మాజీ, వాకపల్లి రాజు, మడకం భాగ్యలక్ష్మి, మల్ల అప్పల నరసారావు, బదిరెడ్డి రాజా, తన్నీరు తాతాజీ, కట్ట వెంకన్నబాబు, నూలు అర్జునుడు, వెలిచేటి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతి హోమం

కోరుకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి సాయిబాబా ఆలయంలో శనివారం పూర్ణాహుతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్తీక మాసం నెల రోజులూ కొనసాగిన అఖండ నామ జప యజ్ఞం ఈ పూర్ణాహుతితో ముగించామని ఆలయ గురుదేవులు మామిడిపల్లి రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగ కేశవరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులకు సాయిబాబా అన్న భవనం వద్ద అన్నప్రసాదాలు అందించారు.

కోటసత్తెమ్మ ఆలయానికి రూ.5 లక్షల విరాళం

నిడదవోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయంలో శనివారం మార్కొండపాడుకు చెందిన ఈదర రామకోటేశ్వరావు తన భార్య గంగాభవాని జ్ఞాపకార్థం రూ.5 లక్షల విరాళం అందజేశారు.ఆయన మనవలు నితిన్‌చౌదరి, సాయిదిలీప్ రూ.28,500 ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి విరాళంగా అందజేశారు.

మాక్ అసెంబ్లీకి వీరవరం విద్యార్థిని ఎంపిక


కందుకూరి సంధ్య

కడియం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి వీరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుకూరి సంధ్య ఎంపికైంది. అమరావతి అసెంబ్లీ హాలులో జరగబోయే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి సంధ్యకు లభించింది. ఈ సందర్భంగా విద్యార్థినితో పాట తనకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయిని రజనిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల రాము, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఆదిమూలం సాయిబాబా, హెచ్ఎం విశ్వనాథ్,ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్మీగణపతికి విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల పూజలు


బిక్కవోలు లక్ష్మీగణపతిని దర్శిస్తున్న విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు

బిక్కవోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతిని శనివారం విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు దర్శించారు. ఈ సందర్భంగా కేరళ క్యాడర్‌కు చెందిన రామపుల్లారెడ్డి(విశ్రాంత ఎన్ఐఆర్‌డీ డైరెకర్ జనరల్), టీవీ నరసింహారావు(విశ్రాంత టూరిజం అధికారి) కుటుంబ సభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు బిక్కవోలులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిక్కవోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో ఆదివారం ఉదయం 9గం.ల నుంచి మధ్యాహ్నం 2గం.ల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్‌ను నిలిపి వేస్తున్నామన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఐఎస్‌టీఎస్ విద్యార్థుల ఎంపిక

రాజానగరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 40 విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రముఖ గ్లోబల్ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌లో సెలెక్ట్ అయినట్టు చైర్మన్ కళ్లం ఉపేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల వైస్ చైర్మన్ అనూష, ప్రిన్సిపాల్ రాజశ్రీ, హెచ్‌వోడీలు, ఏవో ఇక్బాల్, టీపీవో రాయుడు, జయశ్రీ, అధ్యాపకులు అభినందించారు.

శాస్త్రీయ పురోగతికి భౌతికశాస్త్రం పునాది

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పురోగతికి భౌతికశాస్త్రం ఎల్లప్పుడూ పునాదిగా ఉంటుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపసకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం, భౌతికశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రీసెంట్ డెవల్మప్‌మెంట్స్ ఇన్ ఫిజిక్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ప్రకృతి ప్రాథమిక నియమాలను అర్థం చేసుకోవడం నుంచి సాంకేతికతలో విఘాతకరమై ఆవిష్కరణలను నడిపించడం వరకూ భౌతికశాస్త్రం ఆధునిక ప్రపంచాన్ని అపూర్వమైన రీతిలో రూపొందిస్తుందన్నారు. అనంతరం బయోకాన్ బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ లీడ్ ఇన్విస్టిగేటర్ శ్రీనివాస్ కలిదిండి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ ప్రతాప్ కొల్లు పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి, కోకన్వీనర్ ఎస్.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ తప్పనిసరి

కమిషనర్ రాహుల్‌మీనా


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లో ప్రతీ దుకాణం వద్ద చెత్తబుట్ట తప్పనిసరిగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. శనివారం నగరంలోని మెయిన్‌రోడ్డులో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సూచనలు చేశారు. రహదారులు, డ్రైనేజీలు, ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ వేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండకూడదని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలు కావాలని, ఎవరైనా ప్లాస్టిక్ విక్రయించినా, ప్లాస్టిక్ కవర్లతో నిత్యావసర సరుకులు ఇచ్చినా చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్ 6



రాజ్యాంగ సమర్పణ దినోత్సవ సెమినార్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్

రాజ్యాంగం రక్షించబడాలంటే ఏకాత్మను అర్థంచేసుకోవాలి

రాజ్యాంగ సమర్పణ దినోత్సవ సెమినార్‌లో బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎంపీ ఉండవల్లి హాజరు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం రక్షించబడాలంటే ఏకాత్మను అర్థంచేసుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఆంధ్రకేసరి సెంటినరీ రోటరీ హాలులో ప్రకాశం అభివృద్ధి, అధ్యయన సంస్థ - ఆంధ్రకేసరి యువజన సమితి సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మాధవ్ మాట్లాడుతూ అత్యంత మేధస్సు కల్గిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. కాలంలో అవసరమైన మార్పులు చేసుకుంటూ దేశ ప్రయోజనాలకోసం నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ అంబేద్కర్ సూచించారని అన్నారు. అనేక కులాలు, మతాలు, ప్రాంతీయతలు ఉన్నా దేశంలో అందరూ భిన్నమే అని ఇక్కడ ఏకాత్మత సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రాల మధ్య అన్ని అంశాల్లోనూ సమన్వయం అవసరమన్నారు. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిని భారతీయులంతా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా రేషన్‌కార్డులు, పింఛన్లు వంటి ఆలోచనలతో సాగడం రాజ్యాంగ స్ఫూర్తికి అవరోధం కల్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ త్యాగమే పెట్టుబడిగా ఆనాడు ప్రకాశం రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు వి.భాస్కరరామ్ సభకు అధ్యక్షత వహించారు. ప్రకాశం అభివృద్ధి అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.మోహనరావు, విజయవాడ లయోలా కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, ఆంధ్రకేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి సీపీ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

చిక్కితే.. ఖాతా ఖాళీ!

చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు

మళ్లీ చేతికి చేరడం అసాధ్యమే

అప్రమత్తతే ఆయుధం



దొంగలున్నారు.. జాగ్రత్త!. ఇది పోలీసులు తరచు చేసే హెచ్చరిక. మీరు ఎక్కడికైనా వెళితే ఇంట్లోని బంగారం, డబ్బు సురక్షితంగా దాచుకొని వెళ్లాలని చెబుతారు. లేదంటే తమకు సమాచారం ఇస్తే మీ ఇంటికి రక్షణ కల్పిస్తామని కూడా ఈమధ్య హోరెత్తిస్తున్నారు. ఒకవేళ సొత్తు చోరీకి గురైనా పోలీసుల దర్యాప్తులో దొంగలు పట్టుబడటం, సొత్తు రికవరీ చేయడం కూడా మనకు తెలుసు. ఇప్పుడు దొంగలు పడుతున్నది ఇళ్లలో కాదు.. జేబు దొంగలూ కాదు.. మీ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లోనే ఓ కన్నేస్తారు. ఏదొక ఎత్తుగడతో మాయ చేసో, బెదిరించో బ్యాంకు అకౌంట్ల నుంచి మొత్తం దోచేస్తున్నారు. ఇందులో ధనవంతులే కాదు.. చిరుద్యోగులు, ఉద్యోగ విరమణ చేసినవారు, పింఛను పొందుతున్న వృద్ధులు సైతం ఆన్‌లైన్ మోసంలో చిక్కి బలైపోతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సైబర్ క్రైం విషయంలో దొంగా పోలీస్ ఆటలో దొంగలదే పైచేయిగా నిలుస్తోంది. ఆధునిక సాంకేతికతను పోలీసులు అర్థంచేసుకొనేలోపుగా సైబర్ బూచోళ్లు ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఇప్పటివరకూ సైబర్ నేరాల్లో గంటలోపుగా ఫిర్యాదుచేస్తే డబ్బు వెనక్కి రప్పించే అవకాశాలు సగమన్నా ఉండేవి. ఇప్పుడు ఆ సమయం నిమిషాల్లోకి వచ్చేసింది. సొమ్ము ఒక్కసారి ఖాతా దాటితే దాదాపుగా బూడిదలో పోసిన పన్నీరేనని కేసులు రుజువు చేస్తున్నాయి. అధిక శాతం పోలీసులకు ఈ నేరాలపై అవగాహన లేదు. ఎఫ్ఐఆర్ ఎలా, ఏ సెక్షన్ల ప్రకారం నమోదుచేయాలో కూడా తెలియక తికమకపడుతున్నారు. బాధితుడు మోసపోయానని గుర్తించి తేరుకొనేలోపుగా ఆ డబ్బులు నాలుగైదు దశలు దాటిపోతోంది. కొన్నేళ్ల కిందట లాటరీల పేరుతో నైజీరియన్లు సైబర్ నేరాలకు తెరతీశారు. తర్వాత మార్పులు సంతరించుకుంటూ బ్యాంకు ఓటీపీ, ఆధార్ అప్‌డేట్, ప్రభుత్వ పథకాల పేరుతో, కొరియర్, కొద్ది పెట్టుబడితో భారీ రాబడి, యాప్‌లు ఇలా రకరకాల మోసాలు సాగుతూ డిజిటల్ అరెస్టుల వరకూ పరిస్థితి చేరింది. రోజుకో మోసపు ఆలోచనతో కోట్ల సొమ్మును సైబర్ బూచోళ్లు తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వాలు, సాఫ్ట్‌వేర్లు, సర్వర్ల విషయంలో ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నా అవన్నీ బలాదూర్ అని నేరగాళ్లు నిరూపిస్తున్నారు.

● రికవరీ దైవాధీనం


ప్రస్తుతం సైబర్ క్రైంలో రికవరీ శాతం అతి స్వల్పం. రూ.10 కోట్లు పోగొట్టుకుంటే రూ.లక్ష కూడా వెనక్కి రప్పించలేని పరిస్థితి. దర్యాప్తు ఎంత ముమ్మరంగా, తెలివిగా చేసినా ఖాతా నుంచి మాయమైన డబ్బులు వెనక్కి రావడం లేదు. ఖాతా నుంచి డబ్బులు దొంగిలించారని బ్యాంకు వాళ్లకు చెబితే.. పోలీసులకు ఫిర్యాదు చేయండని ఉచిత సలహా పడేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరాలు రోజుకు 20 వరకూ జిల్లా కేంద్రాల్లోని సైబర్ సెల్‌లో రిపోర్టు అవుతున్నాయి. ఇక పోలీస్ స్టేషన్లకు వచ్చినవి, ఎవరికీ చెప్పలేక ఉండిపోయినవి ఇంకెన్నో.

ఏపీకే క్లిక్ చేస్తే.. ఖతం

ఆర్టీవో, ఎస్‌బీఐ, పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్స్‌తో బురిడీ

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురం పట్టణానికి చెందిన సత్యప్రసాద్‌కు తెలిసిన మిత్రుడు వాట్సాప్ నుంచి సందేశం వచ్చింది. మీకు పీఎం కిసాన్ పడిందా లేదా చూసుకోండి అంటూ ఏపీకే ఫైల్‌ను అతను పంపినట్టు పంపారు. దాన్ని క్లిక్ చేశాడు. ఫోన్ హేక్ అయింది. ఉన్న రెండు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఖాళీ కావడంతోపాటు ఇదే రీతిలో అతని పేరుతో కాంటాక్టు లిస్టులో ఉన్నవారందరికి మెసేజీలు వెళ్లాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన నరసింహరావుకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వాట్సాప్ మెసేజీ వచ్చింది. మీ ఎస్‌బీఐ రివార్డ్స్ అప్‌డేట్ చేసుకోండి అని అంతే క్లిక్ చేశాడు. అతని బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.6,500 డెబిట్ అయినట్టు మెసేజీ వచ్చింది. ఇలా రకరకాల ఏపీకే ఫైల్స్ తెలుసున్న వ్యక్తులు, స్నేహితులు, బంధువుల దగ్గర నుంచి వచ్చినట్టు వాట్సాప్‌లు ద్వారా వ్యక్తిగతంగా, గ్రూప్‌ల్లో వస్తున్నాయి. ఏపీకే ఫైల్ ఓపెన్ చేయగానే ఫోన్ హేక్ చేసి డిస్‌ప్లే పేరును స్టేట్‌బ్యాంకు లేదా ప్రభుత్వ సంస్థలుగా మార్చివేసి ఆ పేరుతోనే మెసేజీలు పంపుతున్నాయి. తెలియక కొందరు క్లిక్ చేసి మోసపోవడం జరుగుతోంది. మోసపోయిన వారిలో డెబిట్ అయిన సొమ్ములు తక్కువ కావడంతో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు.



● డిజిటల్ అరెస్టు.. రూ.34 లక్షలకు టోపీ

ముమ్మిడివరానికి చెందిన విశ్రాంతి మండల విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీకి ఈనెల 8న టెలిఫోన్ డిపార్టుమెంట్ పేరిట ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మీ నంబరుపై బెంగళూరులో ఒక సీరియస్ కేసు నమోదై ఉందని, మహారాష్ట్ర కెనారా బ్యాంకులో ఏటీఎం నేరం ఉందని, రూ.3 కోట్ల కుంభకోణంలో రూ.75 లక్షలు మీకు ముట్టిందని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించారు. విశ్రాంత ఎంఈవోను బెదిరించి ఆయన అకౌంట్‌లోని రూ.15 లక్షలు లాగేశారు. తర్వాత పీఎఫ్ లోన్ తీసుకోమని వారే చెప్పి 12న రూ.9 లక్షల 80 వేలు, 15న రూ.9 లక్షల 80వేలు మొత్తం మూడు దఫాలుగా రూ.34లక్షల 60వేలు ఆర్టీజీఎస్ చేయించుకుని టోపీ పెట్టారు. ఆ సొమ్ములు తిరిగి తన ఖాతాకు జమకాకపోవడంతో వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను సైబర్ నేరగాళ్ల మోసానికి గురైనట్టు గుర్తించి ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు.

● రూ.74 లక్షలు కొట్టేశారిలా..

రాజానగరం మండలం కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్. ఆగస్టు 17న స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికారు. సావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా ఓపెన్ చేయగా, డీమ్యాట్ అకౌంట్ ఓపెన్‌చేయాలని మెసేజ్ వచ్చింది. తర్వాత దఫదఫాలుగా 11సార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

● రికవరీ చేశారు..

రాజమహేంద్రవరంలో కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. కస్టమర్‌కేర్ నంబరుకోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఓ నకిలీ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా ఓటీపీని చెప్పడంతో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ సొమ్మును ఫ్రీజ్‌చేసి పదిరోజుల్లో వెనక్కి రప్పించారు.

● తక్షణం ఏమి చేయాలి..

సైబర్ నేరం జరిగి ఖాతాలో డబ్బులు పోతే వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి అకౌంట్ ఫ్రీజ్ చేయించాలి. సైబర్‌క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేయడంతోపాటు నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదుచేయాలి. మీ పరిధి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యా దుచేయాలి. గతంలో గంటలోపు టోల్‌ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేస్తే డబ్బులు విత్‌డ్రా కాకుండా బ్యాంకు ఫ్రీజ్ చేసేది. ఇప్పుడు నిమిషాల్లోనే నేరగాళ్ల క్రిప్టో కరెన్సీలోని మళ్లించేస్తున్నారు.

రేపటి నుంచి డిసెంబర్ 2 వరకూ

'రైతన్న మీకోసం' ఇంటింటి సర్వే

రాజమహేంద్రవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ 'రైతన్న-మీకోసం' కార్యక్రమం కింద హౌస్ టు హౌస్ సర్వే నిర్వహించనున్నారు. రైతుల జీవనోపాధి, ఆర్థికస్థితి, నైపుణ్యాభివృద్ధితో అంచనా వేసి, రైతుల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం సాయంత్రం స్థానిక క్యాంప్ కార్యాలయం నుంచి వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యాన, మత్స్య, అనుబంధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశాల ప్రకారం రైతుల స్థితిగతులపై ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి రైతుతో మాట్లాడడం కోసం ఏడు రోజుల పాటు హౌస్ టు హౌస్ సర్వే చేయనున్నట్టు చెప్పారు. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే ఐదు సూత్రాల పట్ల రైతులకు అవగాహన కల్గించనున్నట్టు చెప్పారు. ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు రైతుల ఇళ్లకు అధికారుల బృందాలు వెళతాయని, ఈనెల 30 నుంచి డిసెంబర్ 2 వరకూ డేటా సేకరించి విశ్లేషిస్తారన్నారు. వచ్చేనెల 3వ తేదీన ఈ డేటా ఆధారంగా 2026-27 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తామని, దాన్ని ప్రతీ రైతు సేవా కేంద్రంలోనూ కార్యశాల నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రం ద్వారా నిర్వహించే ఈ ప్రచారంలో ఆర్ఎస్‌కే సహాయకులు, పశుసంవర్థక, మత్స్యశాఖ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రగతిశీల రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు భాగస్వాములవుతారని తెలిపారు. ఈ సర్వే కోసం ప్రతీ మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి, ఒక అధికార బృందం రోజుకు 30 క్లస్టర్లు అంటే 90 ఇళ్లు సందర్శిస్తారన్నారు. ఒక్కో బృందం మొత్తం 540 కుటుంబాల వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ సమయంలో సీఎం సందేశం లేఖ, కరపత్రం కూడా రైతులకు అందజేస్తారన్నారు. ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఇంటింట ప్రచారంలో రైతుల నుంచి సేకరించిన సూచనలు, ఫిర్యాదులను ప్రణాళిక తయారుచేసి 3న ఆర్ఎస్‌కే స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఆమె వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో ఎస్.భాస్కర రెడ్డి, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్ల పశు సంవర్థక అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లిఖార్జునరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి టి.నిర్మలా కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ కీర్తి చేకూరి టెలికాన్ఫరెన్స్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి.. హాజరైన అధికారులు

సత్యసాయిబాబా శత జయంతి రాష్ట్ర పండుగగా నిర్వహించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈమేరకు రెవెన్యూ, సత్యసాయి గురుకుల పాఠశాల, విద్యాశాఖ, సంగీత కళాశాల సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం సత్యసాయిబాబా జయంతి వేడుకలను జిల్లా, డివిజన్, నియోజకవర్గం, మునిసిపాలిటీ, మండల, సచివాలయ స్థాయిలో అధికారికంగా శత జయంతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలను నవంబరు 19 నుంచి 24 వరకు అత్యున్నత స్థాయిలో నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా 23న బాబా జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు అన్ని కేంద్రాలలో తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వీటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్వో భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో రాణిసుస్మిత, గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, డీపీఆర్వో ఎం. లక్ష్మణాచార్యులు, డీటీ శాస్త్రి పాల్గొన్నారు.

ట్రాఫిక్ టెర్రర్

» సిగ్నల్స్ దోబూచులాట » ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌లు » జిల్లా కేంద్రంలో తిప్పలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ట్రాఫిక్ పూర్తిగా నియంత్రణ కోల్పోయి తలపోటుగా మారింది. ప్రభుత్వశాఖల జిల్లా బాస్‌లు నిత్యం సంచరించే జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో మరీ అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లాలోని అధికశాతం కూడళ్లలో, ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో అసలు ట్రాఫిక్ సిగ్నల్సే లేవు. ఒకవేళ ఉన్నా వాటి నిర్వహణ దైవాధీనంగా ఉంది. నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో సిగ్నల్స్ ఊసేలేదు. సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ కమిషనర్, విద్యుత్తు ఎస్ఈ రోజూ తిరిగే జిల్లా కేంద్రంలో కూడా సిగ్నల్స్ డిస్కోలైట్లను తలపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ఇదే రోడ్లపై సంచరిస్తున్నా వారికి ఈ సమస్య కనబడడం లేదు. రాజమహేంద్రవరంలోని ముఖ్య కూడళ్లయిన కంబాల చెరువు, ఐటీ ఆఫీస్, లాలాచెరువు, డీటీసీ జంక్షన్, శ్యామలా సెంటర్, వీఎల్ పురం జంక్షన్, జాంపేట, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, కోటిపల్లి బస్టాండ్, తాడితోట, వీఎల్‌పురం జంక్షన్లలో సిగ్నల్స్ ఉన్నా అవి ఎప్పుడు మెలకువగా ఉంటాయో వాటికే తెలియడం లేదు. ఒక్కోసారి వెలిగినా ఓ అంకె కనబడితే మరో అంకె దాక్కుంటుంది. అడ్డంగా గీతలు వస్తుంటాయి. ఇక పార్కింగ్ ప్రదేశాలంటూ నిర్దేశించక పోవడంతో ఇష్టానుసారం వాహనాలను నిలిపేయడం పరిపాటిగా మారింది. సిగ్నల్స్ నిర్వహణ బాధ్యత రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్పొరేషన్‌లోని పట్టణ ప్రణాళికా విభాగం చూసుకుంటుంది. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకోవడం వరకూ బాగానే ఉన్నా.. నిర్వహణ విషయంలో అజమాయిషీ అంతంత మాత్రంగా ఉండడంపై విమర్శలు వినవస్తున్నాయి. మొత్తానికి ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకుంటూ ట్రాఫిక్‌ని మరింత జఠిలం చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాక్షాత్తూ జిల్లా పోలీసు కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న టీడీసీ జంక్షన్‌లో కూడా వాహనదారులతో సిగ్నల్స్ ఆటలాడుకుంటూ ఉంటాయి. ఇక్కడ పోలీసులు తమ ఇష్టానుసారం బారికేడింగ్‌లను మారుస్తూ ఉంటారు. ఈ జంక్షన్‌ని ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినా కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్‌ని సక్రమంగా పనిచేయించలేని దుస్థితి నెలకొంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు నరకం చూస్తున్నారు.

● గత ప్రభుత్వంలో..

గతంకంటే ట్రాఫిక్ విపరీతంగా పెరిగిన మాట వాస్తవమే. జిల్లా కేంద్రమైన తర్వాత రాజమహేంద్రవరంలో ఈ సమస్య మరీ ఎక్కువైంది. ఎక్కడైనా ట్రాఫిక్ పెరిగితే ఇబ్బందులు అధిగమించడానికి రోడ్లు, కూడళ్లు వెడల్పు చేస్తారు. కానీ, జిల్లాలో అందుకు భిన్నంగా గత వైసీపీ హయాంలో అభివృద్ధి పేరుతో రోడ్లు, జంక్షన్లను కుచించుకుపోయేలా చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. వాటికి అస్తవ్యస్త సిగ్నల్స్ నిర్వహణ మరింత ఆజ్యం పోస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో కంబాలచెరువు, ఐటీ ఆఫీస్ ఏరియాల్లో జంక్షన్ డవలప్‌మెంట్ పేరుతో చేసిన పనుల వల్ల వాహనదారుల ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. వీటిని తొలగిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రకటించినా.. మిగతా సమస్యల సంగతేంటని జనం ప్రశ్నిస్తున్నారు. కంబాల చెరువు నుంచి లాలాచెరువు వరకూ ఫుట్‌పాత్‌లపై బీళ్లలు అతికించి పూల కుండీలు ఏర్పాటు చేశారు. దీంతో చిరువ్యాపారులు రోడ్డుపైకి రాక తప్పలేదు. అసలే ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ రహదారి ప్రమాదకరంగా మారింది. జాంపేట ఆజాద్ చౌక్‌లో ఆర్టీసీ బస్సులు మలుపు తిరగడానికి నానాకష్టాలూ పడాల్సి వస్తోంది. ఈ ప్రదేశం ట్రాఫిక్ డీఎస్పీ కార్యాలయానికి సమీపంలోనే ఉండడం గమనార్హం.

● ట్రాఫిక్ సలహా కమిటీ ఏమైంది..

సాధారణంగా నగరంలో లేదా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రించడానికి ట్రాఫిక్ సలహా కమిటీ ఉంటుంది. దీనిలో మునిసిపాలిటీ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, నేషనల్ హైవేస్ తదితర శాఖలతోపాటు వ్యాపారులు ఉంటారు. ట్రాఫిక్ సమస్యలపై తాత్కాలిక చర్యలను మాత్రమే ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటారు. శాశ్వతమైన నిర్ణయాలను కమిటీ తీసుకుంటుంది. అయితే అసలు ట్రాఫిక్ సలహా కమిటీలు ఉన్నాయా? అంటే సమాధానం ముఖం చాటేస్తోంది. ట్రాఫిక్ నియంత్రణపై తగిన విధంగా ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ట్రాఫిక్ విభాగానికి ఒకే సీఐ ఉన్నారు. మరో పోస్టును చాన్నాళ్లుగా భర్తీ చేయడం లేదు. సిబ్బంది కొరత ఉండనే ఉంది.



రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ ఇలా..



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

గ్రామీణ రైతులకు రుణాలు ఇవ్వాలి

డీసీసీబీ చైర్మన్ రామస్వామి

రాజమహేంద్రవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ప్రెసిడెంట్లు గ్రామీణ రైతులకు అందుబాటులో ఉండి వారికి రుణాలు ఇవ్వడానికి సహకరించాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం జరిగిన ఆప్కాబ్, సొసైటీ ప్రెసిడెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ సమష్టిగా కృషిచేసి బ్యాంక్‌ను లాభాలబాటలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డీసీసీబీ బ్యాంక్ సీఈవో ప్రవీణ్‌కుమార్, ఏపీసీవోబీ ఫ్యాకల్టీ రమణారావు, సీబీటీ సత్యనారాయణరాజు, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో వైద్యంపై సీఎం సీరియస్

» విచారణకు ఆదేశం » జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంతోనే ఘటన

» జీజీహెచ్‌కు ఎలాంటి సంబంధం లేదు : సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వైద్యం కోసం వచ్చిన 55 ఏళ్ల వ్యక్తికి కాలంచెల్లిన టాబ్లెట్లు ఇవ్వడంతో వాటిని వాడి ఆ వ్యక్తి తీవ్ర అనారోగ్యం పాలైనట్టు వచ్చిన సమాచారంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఏడాది అక్టోబరులో ఎక్స్‌పైర్ అయిన మందులను నవంబరు 8న సదరు రోగికి వైద్య సిబ్బంది ఇచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై సీఎం సీరియస్‌గా స్పందిస్తూ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వచ్చిన ఆదేశాలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో తీవ్ర కలకలం రేపింది. ఈ విషయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు స్పష్టమవుతోందని భావిస్తున్నారు. ఇటు రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యవర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. అయితే దీనిపై జీజీహెచ్‌కు ఎలాంటి సంబంధంలేదని, అసలు ఆ వ్యక్తి జీజీహెచ్‌లో ట్రీట్‌మెంట్ తీసుకోలేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ స్పష్టంచేశారు. తమ డ్రగ్ స్టోర్‌లో ఉన్న అన్ని మెడిసిన్స్‌ను నిశితంగా పరిశీలించామని, అసలు ఆ బ్యాచ్ టాబ్లెట్లు తమ వద్ద లేవని తెలిపారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులకు వైద్యసేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, అసలు ఆ వ్యక్తి ఎవరో కూడా తమకు తెలియదని, ఆసుపత్రిలో వైద్యం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే ఈ ఘటన జరిగినట్టు ప్రాథమికంగా భావిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక అర్బన్ హెల్త్‌సెంటర్లో ఇచ్చిన టాబ్లెట్లు వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలిసింది. నారాయణపురంనకు చెందిన ఒక వ్యక్తి వైద్యం కోసం వెళ్లినపుడు అర్బన్‌హెల్త్‌సెంటర్ వైద్యసిబ్బంది అతనికి కాలం చెల్లిన టాబ్లెట్లను ఇచ్చినట్టు తెలిసింది. ఇది బీపీ కోసం వాడే టాబ్లెట్ అని సమాచారం. కాకినాడ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి గత ఏడాది జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు ఈ టాబ్లెట్లు సరఫరా జరిగాయని చెబుతున్నారు. ఈ ఘటనపై సీఎం సీరియస్ కావడంతో విజయవాడలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ అధికారి ఒకరు శనివారం ఇక్కడికి వచ్చి దీనిపై విచారణ జరిపారు. కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి కూడా ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

నిత్యాన్నదానానికి రూ.5,28,500 లక్షల విరాళం 6

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చోడవరంలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్‌తోపాటు గృహోపకరణ విద్యుత్ సైతం నిలిచిపోతుందన్నారు.

నేడు సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలు

కొవ్వూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు నిర్వ హిస్తున్నట్టు ఎంపీడీవో జీ. రాజమనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

స్వామిత్వ సర్వేపై గ్రామసభ



స్థల యజమానులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న తహశీల్దార్, ఈవోపీఆర్‌డీ

తాళ్లపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మలకపల్లిలో స్వామిత్వ సర్వేపై శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ రాపాక రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఇందులో గుర్తించిన ఇళ్లు, స్థలాల యజమానులకు ధ్రువీకరణ పత్రాలను తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఈవోపీఆర్‌డీ వీరన్న అందజేశారు. తహశీల్దార్ లక్ష్మీలావణ్య మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలలో తెలిపిన ప్రకారం ఇళ్లు, స్థలాల కొలతల్లో తేడాలు ఉన్నట్టు గుర్తిస్తే వాటిని తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని ఫిర్యాదుగా స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కామేశ్వరి, వీఆర్‌వో ప్రకాష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.5,28,500 లక్షల విరాళం



విరాళాన్ని అందిస్తున్న రామకోటేశ్వరరావు

నిడదవోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసి వున్న కోటసత్తె మ్మ వారి నిత్యాన్నదాన పథకానికి శనివారం మార్కొండపాడుకి చెందిన ఈదర రామకోటేశ్వరరావు తన భార్య ఈదర గంగాభవాని జ్ఞాపకార్థం రూ. 5,00,000, ఆయన మనుమలు నితిన్ చౌదరి, సాయి దిలీప్ రూ. 28,500 ... మొత్తం రూ. 5,28,500 లక్షల విరాళాన్ని ట్రస్ట్‌కు అందజేసినట్టు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

తాడిపర్రు మాజీ సర్పంచ్ సత్యనారాయణ మృతి



ఉండ్రాజవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రుకి చెందిన మాజీ సర్పంచ్, దాత మట్టా సత్యనారాయణ (76) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. ఈయనకు కుమారుడు చంటి, కుమార్తె చిన్ని ఉన్నారు. ఈయన ఇటీవల శివాలయం నిర్మాణానికి రూ. 23.50 లక్షల విరాళాన్ని అందజేశారు. అలాగే గ్రామ పంచాయతీ నిర్మాణానికి స్థలం దానం చేశారు. గ్రామంలో పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో తరగతి గదుల నిర్మాణం, గ్రామదేవత గోగులమ్మ ఆలయం అభివృద్ధికి తనవంతు చేయూత అందజేశారు. సత్యనారాయణ మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

శాస్త్రీయ పురోగతికి భౌతికశాస్త్రం పునాది

● నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పురోగతికి భౌతికశాస్త్రం ఎల్లప్పుడూ పునాదిగా ఉంటుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపసకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం, భౌతికశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రీసెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ ఫిజిక్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ప్రకృతి ప్రాథమిక నియమాలను అర్థం చేసుకోవడం నుంచి సాంకేతికతలో విఘాతకరమైన ఆవిష్కరణలను నడిపించడం వరకూ భౌతికశాస్త్రం ఆధునిక ప్రపంచాన్ని అపూర్వమైన రీతిలో రూపొందిస్తుందన్నారు. అనంతరం బయోకాన్ బ్రిస్టల్ మైనర్స్ స్విబ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ లీడ్ ఇన్విస్టిగేటర్ శ్రీనివాస్ కలిదిండి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ ప్రతాప్ కొల్లు పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి, కోకన్వీనర్ ఎస్.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ పి.వి జయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్‌కోడ్లను రద్దుచేయాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్

కొవ్వూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దుచేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత కార్మిక సంఘాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 12గంటల పని విధానాన్ని రద్దు చేసి, ఎనిమిది గంటల విధానాన్ని అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, పీవోడబ్ల్యు నాయకురాలు ఈ.మల్లిక, ఎం. మంగతాయారు, ఆర్.హరీష్, పి.వెంకన్న, శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, రాజేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే బీజేపీ పనిచేస్తోందని సీఐటీయూ నాయకుడు జువ్వల రాంబాబు ఆరోపించారు. శనివారం పట్టణంలోని బిల్డింగ్ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్ అమలుకు నోటిఫై చేయడాన్ని ఖండిస్తూ ఆ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కార్మికవర్గాలు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్ అమలుకు కేంద్రం నోటిఫై చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో గండి శ్రీనివాస్, పి.చినబాబు, గుమ్మడి రమేష్, ఎం.రాజేష్, గండి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: లేబర్ కోడ్లను తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్.భగత్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యర్నగూడెంలో సీఐటీయూ కార్మిక సంఘం నేతలు లేబర్‌కోడ్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాశనం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే చెల్లుతోందన్నారు. కనీస వేతనాలు, పని భద్రత, సంఘం పెట్టుకునే హక్కు, అలాంటి అంశాల్లో యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, పిట్టా శ్రీను, ఉప్పల శ్రీను, మద్రి రవి, కే.శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నిడదవోలులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



దేవరపల్లిలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

నూతన వరివంగడాలపై దృష్టిసారించాలి

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్

ఉండ్రాజవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి ఇచ్చే నూతన వరి రకాలపై రైతులు దృష్టిసారించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సత్యవాడ, కాల్దరిలో అభ్యుదయ రైతులకు నూతన వరివంగడాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్టేరు పరిశోధనా కేంద్రం నుంచి అభివృద్ధి పర్చిన ఎంటీయూ 1426, నెల్లూరు పరిశోధన కేంద్రం అభివృద్ధి పర్చిన ఎన్ఎల్ఆర్ 3648 రకం ధాన్యం 120 నుంచి 125 రోజుల్లో పంట కోతకు వస్తాయన్నారు. దాళ్వా పంటలో ప్రయోగం నిమిత్తం అభ్యుదయ రైతులకు నూతన రకం కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వారు వివరించారు. ఈ వరి రకాలు హెక్టారుకు 6.5 నుంచి ఏడు టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. అగ్గి, ఎండాకు తెగులు, దోమపోటు, ఉల్లికోడును తట్టుకుంటాయని శాస్త్రవేత్తలు చెప్పారు. అనంతరం రైతులకు నూతన వరివంగడాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో బీ. రాజారావు, అభ్యుదయ రైతులు శ్రీనివాస్, దొరబాబు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు నూతన వరివంగడం కిట్లను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

● 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుని సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ అన్నారు. శనివారం అదనపు జిల్లా జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్‌పై సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కోర్టు పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో ఎన్ని కేసులు పెండింగ్ ఉన్నాయి, ఎన్ని రాజీకి వచ్చాయని గుర్తించారు. అందులో ఎన్ని రాజీ అవుతాయని స్టేషన్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి అను రాధ మాట్లాడుతూ డిసెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ రాజీ పడదగిన కేసులను రాజీ చేసుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జీ.సాయికృష్ణ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కే.నాగలక్ష్మి, డీఎస్పీ జీ.దేవకుమార్, కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, సీఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ సీఐ జీ.సత్యనారాయణ, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● శక్తి టీమ్ ఎస్ఐ వెంకటేశ్వరరావు



బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

కొవ్వూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శక్తి టీమ్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. డీఎస్పీ జీ.దేవకుమార్ ఆదేశాల మేరకు కుమారదేవం జడ్పీ హైస్కూల్లో శనివారం శక్తి టీమ్ సభ్యులు బాలిక చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్, 112 కాల్, సైబర్ మోసాలు, పలురకాల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు, భవాని, పద్మ, హెడ్‌మాస్టార్ ఏ.చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దుర్గారావు

తాళ్లపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ కార్యవర్గ సాధారణ సమావేశం శనివారం సాయంత్రం పైడిమెట్ట బేసిక్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఎలక్షన్ అధికారిగా విచ్చేసిన ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కమిటీ సభ్యులు రెండు సంవత్సరాలు పదవీ కాలంలో ఉంటారన్నారు. అనంతరం నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా కే. ప్రసాదరావు, గౌరవ అధ్యక్షుడిగా వై.శంకరం, ప్రధాన కార్యదర్శిగా ఎం. శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా జీ. రాజారత్నం, పి. కనకదుర్గ, వీ. శాంతకుమారి, కార్యదర్శులుగా జీవీకే రాజు, టీ. రమాదేవి, కె. మంజు, సీహెచ్ భాస్కర్, కౌన్సిలర్లుగా బీఎస్ మూర్తి, కె. రామ్మోహనరావు, పి. సుభాషిణి, జి. కృష్ణ, హెచ్. పద్మశ్రీమణి, ఆడిట్ కమిటీ సభ్యులుగా కె.శిఫాబాయమ్మ, ఏఎస్ మధులత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రఘువీర శాస్త్రి, నాని వ్యవహరించారు.

పూర్ణాహుతి హోమం

కోరుకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి సాయిబాబా ఆలయంలో శనివారం పూర్ణాహుతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్తీక మాసం నెల రోజులూ కొనసాగిన అఖండ నామ జప యజ్ఞం ఈ పూర్ణాహుతితో ముగించామని ఆలయ గురుదేవులు మామిడిపల్లి రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగ కేశవరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులకు సాయిబాబా అన్న భవనం వద్ద అన్నప్రసాదాలు అందించారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




విలేఖరులతో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. శనివారం నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆరు గురు దొంగలను ప్రవేశపెట్టి, వారి వద్ద నుంచి మూడు లక్షల నగదు, బంగారం చైన్, రెండు గాజులు, కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసు కున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన షేక్‌ఫక్రుద్దీన్ ఒంగోలు జైలులో ఉన్నప్పుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కేసు ఉమ్రో మోహదా (హోలిటేడా పంచాయతీ, గంధవాన్ మండలం, ధార్ జిల్లా) రాగన్ మధవ్ హటిలా, బారిక్ సింగ్ ఆజీనార్, ముహరు కల్లు మహ దా, హీరు హరియా అజీనార్‌తో పరిచయం ఏర్పడింది. అనంతరం జైలు నుంచి విడుదలైన తరువాత ఏపీలో సంపన్నులు ఉంటారని, నేరం చేద్దామనుకుని నిర్ణయించుకున్నారు. దీంతో సెప్టెంబరు 24వ తేదీ అర్ధరాత్రి నల్లజర్లలో ఒంటరిగా నివసిస్తున్న పాకలపాటి సుభద్ర ఇంటి తలుపులు పగులగొట్టి ఆమె మెడలోని బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. అంతకుముందు ప్రత్తిపాడులో ని సురేష్ జ్యూయలరీలో 11 కేజీల వెండి, ఒక బైక్ దొంగతనం చేశారు. తర్వాత నల్లజర్లకు రెండు బైక్‌లు, కారుతో వచ్చి ఇక్కడ కూడా చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత ఖమ్మం వెళ్లి అక్కడ నుంచి మధ్యప్రదేశ్‌కు రైలులో పారిపోయారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, దేవరపల్లి సీఐ నాయక్ ఆధ్వర్యంలో రెండు బృందాలు మధ్యప్రదేశ్ వెళ్లి గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఫక్రుద్దీన్ కదలికలపై నిఘా పెట్టారు. కాగా, ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం నల్లజర్లలో పోతవరం కుడి కాల్వ గట్టుపై అనుమానాస్పదంగా కొంతమంది తిరుగుతున్నట్టు నల్లజర్ల సీఐ రాంబాబుకు సమాచారం రావడంతో తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. విచారణ అనంతరం అంతర్ రాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించుకుని వారి వద్ద నుంచి సొత్తును రికవరీ చేశారు. కష్టపడి పనిచేసిన పోలీసులను డీఎస్పీ అభినందిం చారు. ఈ ముఠాను ధార్ ముఠాగా పిలుస్తారని, మధ్యప్రదేశ్‌లోని నాలుగు గ్రామాల్లో వీరంతా కలిసి ఉంటూ నిత్యం దొంగతనాలు చేయడం, పోలీసులు వెళితే వారిపై దాడులకు పాల్పడడం, అవసరమయితే చంపేయడం వంటివి చేస్తారని డీఎస్పీ తెలిపారు. వీరు గతంలో పోలీసు అధికారులపై ఫైర్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. అలాగే ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీఐలు నాయక్, రాంబాబు, ఎస్ఐ దుర్గాప్ర సాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి స్థాపనే క్రైస్తవుల లక్ష్యం

● ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు



వాదాలకుంటలో నూతన మందిర ప్రతిష్ఠ చేస్తున్న ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు

గోపాలపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో శాంతి స్థాపనే క్రైస్తవుల ముఖ్య లక్ష్యమని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. వాదాలకుంటలో బాల ఏసు దేవాలయ మహోత్సవ నూతన మందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేలచింతలగూడెం విచారణ గురువులు బెల్తాజార్ కాటన్ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన గురువులు, పీఠాధిపతి జయరా వును ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వాసులను ఉద్దేశించి జయరావు మాట్లాడుతూ సమస్థమానవాళి రక్షణకై ఏసుక్రీస్తు కన్య మరియ గర్భాన ఉద్భవించార న్నారు. మానవళి రక్షణార్థమే ఆయన లోకానికి వచ్చారన్నారు. ప్రార్థన మందిరం విశిష్టతను ఆయన విశ్వాసులకు వివరించారు. మందిరానికి ముందు భాగంలో నిర్మించిన బాలేసు స్వరూపాన్ని ఆయన ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాదర్ మోజేశ్, మాథ్యూస్, కాకి చార్లెస్, పలువురు గురువులు, సంఘ కాపరి రవివర్మ, సంఘ పెద్దలు వగలపు రాయికృష్ణారావు, నూతలపాటి శ్రీనివాసరావు, మల్లిపూడి చినవెంకన్న, మల్లిపూడి సూర్యచంద్రం, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంఘానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ సుబ్బరాజు, తదితరులు

దేవరపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని యర్నగూడెం సొసైటీ చైర్‌పర్సన్ పెనుమత్స సుబ్బరాజు అన్నారు. యర్నగూడెంలో ఫిషర్ మ్యాన్ కోపరేటివ్ సొసైటీకి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనా పథకం ద్వారా రూ. 85 వేల చెక్కును యర్నగూడెం సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స సుబ్బరాజు సంఘ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ మత్స్యకారుల సంఘానికి సహకార సంఘాల ద్వారా రుణాలను మంజూరు చేసి వారి ఉన్నతికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. అర్హులైన మత్స్యకార సహకార సంఘాల ద్వారా మత్స్యకారుల జీవనాభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఆర్థిక సహకారం అందించటం జరుగుతుందన్నారు. యర్నగూడెం మత్స్యకార సొసైటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 లక్షలను ఎంసీడీసీ ద్వారా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారిణి కృష్ణవేణి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లిన విజయభాస్కర్, జూనియర్ కాలేజీ చైర్మన్ గద్దే శ్రీనివాస్, ఎఫ్ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ రాజు, మత్స్య సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు ముంగర అయ్యన్న, జీ.సుబ్బారావు, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

నూతన జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పించాలి

● డ్వామా పీడీ నాగ మహేశ్వరరావు ● గోపాలపురంలో గ్రామసభ నిర్వహణ



గ్రామసభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ నాగమహేశ్వరరావు

గోపాలపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని కోరుకునేవారికి నూతన జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పించాలని డ్వామా పీడీ ఎం.నాగ మహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సచివాలయం వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామసభను ఎంపీడీవో జీ.రాజమనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీడీ మాట్లా డుతూ గ్రామస్థాయిలో పారదర్శకతను ప్రజలకు చేరువ చేయడం కోసమే గ్రామగ్రామాన గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీ కారణంగా తొలగించిన జాబ్‌కార్డులను పరిశీలించి అర్హులైన వారికి వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లోనూ శనివారం గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు రద్దైన ఉపాధి శ్రామికులు వెంటనే జాబ్‌కార్డును పునరుద్ధరించుకోవల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీవో జేవీ రమణ, పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి శ్రామికులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు

ఎంపీడీవో ఆర్. శ్రీదేవి

చాగల్లు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం జాతీయ ఉపాధి హామీ గ్రామసభలు జరిగాయి. చంద్రవరంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో ఆర్. శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని పనులను గుర్తించి ప్రణాళికబద్ధంగా సిద్ధం చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికి జాబ్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈవో ఆర్‌డీ శ్రవణ్‌కుమార్, పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



చంద్రవరంలో జరిగిన ఉపాధి హామీ గ్రామసభకు హాజరైన ప్రజలు

సూరదేవర రంజిత్ జన్మదిన వేడుకలు



కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, రంజిత్, తదితరులు

కొవ్వూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా ఒక కుటుంబమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు సూరదేవర రంజిత్ జన్మదిన వేడుకలను కొవ్వూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ తన నివాసంలో అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని రంజిత్‌కు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, దాయనరామకృష్ణ, మద్దిపట్ల మురళీ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, పట్టణ, మండల అధ్యక్షుడు అర్జిల్లి రామకృష్ణ, బేదిన నారాయణ, పొట్రు శ్రీనివాసరావు, తోరం నగేష్, బిక్కిన ఫణీంద్ర, కురుకూరు శివరామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణం



కొలువుదీరిన నూతన పాలకవర్గం

పెరవలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యవర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రాధాకృష్ణ, తదితర గ్రామపెద్దల సమక్షంలో సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలుగా రంగినీడి కమలాదేవి సభ్యులుగా యడ్లపల్లి అంజిబాబు, దాసరి మణి, మిరియాల సత్యవతి, వేండ్ర నాగలక్ష్మి, వసంతాడ బుజ్జి, గుత్తుల అనంతలక్ష్మి, కలగ శ్రీ వెంకట సుబ్రహ్మణ్యం, ఆకుల గణపతి, కానూరు కృష్ణ, గారపాటి మురళీకృష్ణ, వాడపల్లి లక్ష్మీనరసింహ, కేశవరావు ప్రమాణస్వీకారం చేశారు. గ్రామ ప్రముఖులు రంగినీడి కట్లయ్య, పోపొవుప్పు నాగేశ్వరరావు, తదితర కూటమి సభ్యులు పాల్గొన్నారు.